

యూరియాపై రచ్చ

సరఫరాలో వైఫల్యాలపై ఆగ్రహం

ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. యూరియా సమస్యపై జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు భగ్గుమన్నారు. సరఫరాలో వైఫల్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడియం ఎదుట నిలబడి 20 నిమిషాల పాటు ఆందోళనకు దిగారు. రైతులు పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో శాంతించారు.

పోడియం వద్దకు దూసుకొచ్చిన జెడ్పీటీసీ సభ్యులు ● సుమారు 20 నిమిషాల పాటు ఆందోళన

- కొన్ని పీఏసీఎస్‌లకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపణ
- సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్న అధికారులు
- జెడ్పీటీసీ సభ్యుల గౌరవ వేతనం రూ.74.93 లక్షలు విడుదలకు ఆమోదం
- వాడీవేడిగా ఉమ్మడి కృష్ణాజిల్లా జెడ్పీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, చిత్రంలో కలెక్టర్ బాలాజీ, ఎన్టీఆర్ జిల్లా జేసీ ఇలక్కియా, నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జెడ్పీ కన్వెన్షన్ హాలులో గురువారం జరిగింది. తొలుత వ్యవసాయశాఖపై సమీక్ష నిర్వహించారు. గూడూరు మండలంలోని తరకటూరు, రాయవరం పీఏసీఎస్‌లకు ఇంతవరకు యూరియా ఇవ్వలేదని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు సురేష్ తెలిపారు. ఇంట్లో మహిళల పుస్తెలను తాకట్టు పెట్టి మరీ రైతులు బయట మార్కెట్‌లో అధిక ధరకు యూరియా కొనుగోలు చేస్తున్నారని గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్‌రాణి ఆవేదన వ్యక్తం చేశారు. కృత్తివెన్ను మండలానికి 400 టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 150 టన్నులను మాత్రమే ఇచ్చారని కృత్తివెన్ను జెడ్పీటీసీ

మిగతా 6లో..



పోడియం ఎదుట ఆందోళన చేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు

యూరియా కొరత లేకుండా చూస్తున్నాం : కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ భారీవర్షాల కారణంగా మొక్కదశలో ఉన్న వరిపైరు నీటమునిగిందని, ఆ పైరును బతికించుకునేందుకు అదనపు కోటాగా రైతులు పలు మండలాల్లో యూరియాను వినియోగించారని తెలిపారు. ఒకరిద్దరు యూరియాను పెద్ద మొత్తంలో తరలించుకుపోయారని, ఈ ఘటనలపైనా విచారణ చేశామన్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య యూరియా కొరత కొంతమేర ఏర్పడిందన్నారు. ఈ విషయాలు ప్రభుత్వానికి నివేదించి అదనంగా యూరియాను జిల్లాకు తీసుకు వచ్చేందుకు అనుమతులు తీసుకున్నామని తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో పరిస్థితిని చక్కదిద్దుతామని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో రైతులకు అవసరమైన 23 వేల టన్నుల యూరియా సరఫరా చేశామని తెలిపారు. ఇంకా 500 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతులు సాగుచేసిన భూమిని బట్టి యూరియాను సరఫరా చేయాలని అధికారులను కోరారు. యూరియా సరఫరాలో సమస్యలు ఉంటే తనకు ఏ సమయంలోనైనా ఫోన్ చేసి చెప్పాలని కలెక్టర్ బాలాజీ భరోసా ఇచ్చారు.

పాఠశాల భవనాలను పూర్తి చేయాలి

విద్యాశాఖపై సమీక్షలో పాఠశాల భవనాల నిర్మాణం తుదిదశలో ఉండగా పనులను నిలిపివేశారని జి.కొండూరు, కృత్తివెన్ను, పెదపారుపూడి, తోట్లవల్లూరు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొద్ది మొత్తం నగదు వినియోగిస్తేనే భవనాలు అందుబాటులోకి వస్తాయని, కొన్ని పాఠశాల భవనాలకు అనుమతులు ఇచ్చినా పనులు చేయడం లేదని వివరించారు. ఏ.కొండూరు మండలం కుంటముక్కల గురుకుల బాలికల పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ వరదల కారణంగా కూలిపోయి ఏడాది అయ్యిందని, నేటివరకు నిర్మాణం చేయలేదని సమావేశం దృష్టికి తెచ్చారు. తల్లికి వందనం నగదు కొందరికి జమకాలేదని, నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వరి దిగుబడి ప్రశ్నార్థకం!

కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడంతో ప్రత్యామ్నాయం వైపు దృష్టి

తక్కువ ధరకు వస్తున్న యూరియా అధికంగా వినియోగం

- మరికొన్ని చోట్ల అమ్మోనియా వాడకం
- వీటివల్ల ధాన్యంలో తగ్గనున్న నాణ్యత

ఏపుగా పెరిగిన వరి



ఈ ఏడాది వరి దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా కాంప్లెక్స్ ఎరువుల ధరలు రూ.250 నుంచి రూ.350 వరకు పెరగడంతో రైతులు ప్రత్యామ్నాయ ఎరువుల వైపు వెళ్లారు. తక్కువ ధరకు యూరియా ఒక్కటే అందుబాటులో ఉండటంతో వాడకం విపరీతంగా పెంచారు. యూరియా అందుబాటులో లేనిచోట్ల అమ్మోనియా వినియోగించారు. దీంతో పైరు ఏపుగా పెరుగుతుంది కానీ ధాన్యంలో నాణ్యత పడిపోతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

ఆంధ్రజ్యోతి - గుడివాడ: జిల్లాలో నూటికి 80 శాతం కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఏడాది కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడంతో ప్రత్యామ్నాయ ఎరువుల వైపు దృష్టి మరలించారు. 20.20.0.13 ఎరువు ధర రూ.250 పెరగగా, 10.26.26 ఎరువు ధర రూ.275 పెరిగింది. కేవలం డి.ఎ.పి మాత్రమే గత ఏడాది ధరకు లభ్యతలో ఉంది. అది కూడా అతి తక్కువగా అందుబాటులో ఉండటం, దీంతో పాటు లింక్‌గా జింక్‌ను తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సి రావడంతో రైతులు ప్రత్యామ్నాయం వైపు మరలారు. ముఖ్యంగా వరిలో 20.20.0.13, 14.35.14, 28.28.0 ఎరువులు బలాన్ని చేకూరుస్తాయి. వరిలో మొక్క బిరుసు రావడం, ధాన్యం నాణ్యత పెరగడం కోసం పొటాష్ లేదా 10.26.26 ఎరువులను వాడతారు. ధరలు పెరగడంతో కొందరు కౌలు రైతులు నామమాత్రంగా కాంప్లెక్స్ ఎరువులతో అధిక మోతాదులో యూరియాను వినియోగిస్తున్నారు.

ఎకరాకు కేవలం బస్తా యూరియా చాలు..

అధిక యూరియా వాడకంతో అనేక నష్టాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. యూరియా కేవలం మొక్కను ఏపుగా పెంచి కంటికి ఇంపుగా కనిపించేలా చేస్తుంది. అధికంగా వాడకంతో వరి ఏపుగా పెరిగితే చిన్నపాటి గాలికే నేలకొరిగే ప్రమాదముంది. ఈ ఏడాది కౌలు

మిగతా 6లో..



పురిటిగడ్డ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన అధికారుల బృందం

- పురుగులున్న బియ్యం మార్చి వేరే బియ్యం సరఫరా

6

చేనేత రంగాన్ని ఆదుకోండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- చేనేత అధ్యయన యాత్ర ప్రారంభం

దసరా శరన్నవరాత్రులకు ఏర్పాట్లు

6

- పనులు పరిశీలించిన అధికారులు

రొయ్య రైతుకెంత కష్టం!

అమెరికా సుంకాల ప్రభావంతో తగ్గిన ధరలు

- అమాంతం పడిపోయిన 100, 40, 30 కౌంట్ రొయ్యలు
- తగ్గని సీడ్, ఫీడ్, విద్యుత్ ధరలు
- పెరిగిన సాగు ఖర్చు, తగ్గిన రాబడితో అయోమయంలో రైతులు
- సాగుకు స్వస్తి చెప్పేందుకు ఉమ్మడి కృష్ణా రైతుల సమాయత్తం

8

రొయ్యల పట్టుబడిలో కార్మికులు



అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడిదుడుకులు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని రొయ్యల సాగుపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. అమెరికా సుంకాల నేపథ్యంలో ఎగుమతులు పూర్తిగా క్షీణించాయి. *100, 40, 30* కౌంట్ రొయ్యల ధరలు అమాంతం పడిపోయాయి. సీడ్, ఫీడ్, విద్యుత్ ధరలు మాత్రం అలాగే ఉన్నాయి. దీంతో పెరిగిన సాగు ఖర్చులు, తగ్గిన దిగుబడితో రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇక సాగుకు స్వస్తి చెప్పేందుకు ఉమ్మడి కృష్ణా రైతుల సమాయత్తమవుతున్నారు.

నెత్తుటి ధారలు!

జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- మృతుల్లో ఒకరు భవన నిర్మాణ కార్మికుడు, మరొకరు వృద్ధుడు
- మచిలీపట్నం, నిడుమోలులో విషాద చాయలు

జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఒకరు భవన నిర్మాణ కార్మికుడు కాగా, మరొకరు వృద్ధుడు. మచిలీపట్నంలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న బాపట్ల జిల్లా కొల్లూరుకు చెందిన గౌరిపర్తి సుబ్రహ్మణ్యం స్మార్ట్ రైస్‌కార్డు కోసం సొంతూరు వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. పామర్రు మండలం నిడుమోలు గ్రామానికి చెందిన చిగురుపాటి రామదాసు నిమ్మలూరులో జరిగే ఓ కార్యక్రమానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో కన్నుమూశాడు. దీంతో ఇరు గ్రామాల్లో విషాద చాయలు అలముకున్నాయి.

6



దసరా డబుల్ డ్యూటీ!

ఒక ఉద్యోగికి ఒకే రోజు ఒకే షిఫ్ట్‌లో రెండు ప్రాంతాల్లో విధులు

వార్డు సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పని చేస్తున్న జస్వంత్‌కు పున్నమి ఘాట్ వద్ద దసరా డ్యూటీ వేశారు. ప్రతి రోజూ రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు అక్కడే విధులు నిర్వర్తించాలని వీఎంసీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అదే ఉత్తర్వుల్లో అదే జస్వంత్‌కు అదే సమయంలో(రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు) నాలుగు పిల్లర్ల సెంటర్‌లో విధులు నిర్వర్తించాలని ఆదేశాలిచ్చారు.

మరో సచివాలయంలో పని చేసే వెల్ఫేర్ సెక్రటరీ సాయికిషోర్‌కు రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మోడల్ గెస్ట్ హౌస్ వద్ద డ్యూటీ వేశారు. అదే సమయంలో పున్నమి ఘాట్ వద్ద డ్యూటీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇలా ఒకే ఉద్యోగికి ఒకే రోజు ఒకే షిఫ్ట్‌లో రెండు ప్రాంతాల్లో డ్యూటీలు వేశారు. ఇలా మొత్తంగా 207 మంది ఉద్యోగులకు డబుల్ డ్యూటీలు వేశారు. సచివాలయ ఉద్యోగులకు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్(వీఎంసీ) అధికారులు కేటాయించిన దసరా ఉత్సవాల విధుల తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

మొత్తం 207 మంది ఉద్యోగులకు ఇదే విధంగా విధుల కేటాయింపు

- ఉత్తర్వులు చూసి నివ్వెరపోతున్న వెల్ఫేర్ సెక్రటరీ, మహిళా పోలీసులు
- వీఎంసీ అధికారుల పనితీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- 50 ఏళ్ల వయసు పైబడిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రాత్రి విధులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వార్డు సచివాలయాల ఉద్యోగులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ): ఇంద్రకీలాద్రిపై ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 11 రోజుల పాటు దసరా ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. లక్షల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు అవసరమైన వసతులను కల్పించేందుకు అన్నిశాఖల అధికారులకు ప్రభుత్వం విధులు కేటాయిస్తోంది. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వాహనాల పార్కింగ్, వీఐపీ ప్రోటోకాల్, కంట్రోల్ రూం నిర్వహణ తదితర పనులు చేసేందుకు వార్డు వెల్ఫేర్ సెక్రటరీ, మహిళా పోలీసులకు వీఎంసీ అధికారులు కేటాయించిన విధుల తీరుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. అక్టోబర్ ఒకటో తేదీన సామాజిక పింఛన్లను వెల్ఫేర్ సెక్రటరీలు పంపిణీ చేయాల్సి ఉందనే విషయాన్ని వీఎంసీ అధికారులు మర్చిపోయి దసరా విధులు కేటాయించడాన్ని ఉద్యోగ సంఘాల నాయకులు తప్పుపడుతున్నారు.



డ్రాఫ్ట్, ఇంజనీరింగ్ సెక్షన్‌లను కలిపేసి.. డబుల్ డ్యూటీ!

నిర్ధేశించిన 26 సెక్టార్‌లకు 43 విభాగాల్లో 1,490 మంది పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులకు విధులు కేటాయించారు. వీరిని పర్యవేక్షించే విధులను నగరంలోని 286 సచివాలయాల్లో పని చేసే వెల్ఫేర్ సెక్రటరీ, మహిళా పోలీసులకు అప్పగిస్తూ ఈ నెల తొమ్మిదో తేదీన వీఎంసీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో సెక్టార్‌లో ఎనిమిది గంటల చొప్పున

మిగతా 6లో..



దసరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఏడీసీపీ రామకృష్ణ, ఈవో శీనానాయక్

శరన్నవరాత్రులకు ఏర్పాట్లు

» పనులు పరిశీలించిన కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించి జరుగుతున్న పనులను కలెక్టర్ జి.లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు తదితరులు దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్‌తో కలిసి గురువారం పరిశీలించారు. క్యూలలో అత్యవసర ద్వారాల ఏర్పాటు, హోల్డింగ్ ఏరియాలను, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశ్రాంతి తీసుకోవడానికి, క్యూలలోకి క్రమంగా ప్రవేశించడానికి కొత్త హోల్డింగ్ పాయింట్లు నిర్ణయించారు. వినాయకుడి గుడి, ఆర్‌ఈ చైనావాల్, టోల్‌గేట్, ఘాట్ రోడ్డు మీదుగా అమ్మవారి ఆలయం వరకు విస్తరిస్తారు. ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పార్కింగ్ స్థలాల గుర్తింపు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలపై పోలీసు అధికారులు సమీక్షించారు. భక్తులకు మంచినీరు, పాలు, అన్నప్రసాదం ఏర్పాట్లు చేయనున్నారు. మరుగుదొడ్లు, వైద్య సహాయ కేంద్రాలు, సమాచార కేంద్రాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గతేడాది అనుభవాల ఆధారంగా భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తున్నారు. ఆలయ పరిసరాలు, క్యూలలో, ఘాట్‌లలో సీసీ టీవీ కెమెరాల నిఘా పెంచనున్నారు.ఆన్‌లైన్‌లో స్వచ్ఛంద సేవకులకు నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, భక్తులకు ప్రసాదాలు, అన్నప్రసాదం నాణ్యతలో రాజీ పడకూడదని సూచించారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను విజయవంతం చేయడానికి, భక్తులకు మెరుగైన దర్శనం, సౌకర్యాలు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



ఎంపీ కేశినేని శివనాథ్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఈవో

దసరా మహోత్సవాలకు ఎంపీకి ఆహ్వానం

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వరస్వామి సన్నిధిలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వరకు జరగబోయే దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు విచ్చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని ఆలయ ఈవో శీనానాయక్ ఆహ్వానించారు. గురువారం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ శివనాథ్‌కు ఈవో, ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్, వేద పండితులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఇంద్రకీలాద్రిపై దసరా ఏర్పాట్లు గురించి ఎంపీ అడిగి తెలుసుకున్నారు.



పురిటిగడ్డ జడ్పీహైస్కూల్‌లో బియ్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ వనజాక్షి, అధికారులు

పురిటిగడ్డ జడ్పీహైస్కూల్‌ను సందర్శించిన అధికారుల బృందం

» పురుగుల బియ్యం మార్చి మంచి బియ్యం సరఫరా

చల్లపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పురిటిగడ్డ జిల్లాపరిషత్ హైస్కూల్(ప్లస్)ను అధికారుల బృందం గురువారం సందర్శించారు. పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనంలో తెల్లపురుగులు వచ్చిన విషయాన్ని విద్యార్థులు చెప్పటంతో అప్రమత్తమైన హెచ్‌ఎం వండిన ఆహారాన్ని పారవేయించి మళ్లీ వండించి పిల్లలకు పెట్టిన వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారణకు డీఈవో పీవీజే.రామారావు ఆదేశాల మేరకు ఎమ్మీవోలు సుజాత, పి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కె.వనజాక్షి, స్టోరేజ్ మేనేజర్ శ్రీలక్ష్మి, సివిల్ సప్లయిస్ డీటీ శ్రీనివాసరావు, ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్‌లు పాఠశాలను సందర్శించారు. అన్నంలో పురుగులు వచ్చిన ఘటనపై విచారించారు. శుక్రవారం నుంచి కొత్తగా బియ్యాన్ని పంపేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వీఆర్వో కళ్లేపల్లి బేబి తదితరులున్నారు.



చౌటపల్లి వద్ద చప్టాపై ప్రవహిస్తున్న వెదుళ్లవాగు

ఉధృతంగా వెదుళ్లవాగు.. రాకపోకలు బంద్

చౌటపల్లి(తిరువూరు) : మండలంలోని చౌటపల్లివద్ద వెదుళ్ల వాగు చప్టాపై (లోలెవల్‌బ్రిడ్జి)నుంచి ప్రవహిస్తుండటంతో గురువారం ఉదయం జి.కొత్తూరు, చిక్కుళ్లగూడెం, పల్లెర్లమూడి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం డివిజన్ పరిధిలోని గంపలగూడెంలో 109.4 మిల్లీమీటర్లు, విస్సన్నపేటలో 91.2 మిల్లీమీటర్లు, తిరువూరులో 78.6 మిల్లీమీటర్లు, రెడ్డిగూడెం మండలంలో 22.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. భారీవర్షంతో పలుగ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిలిచింది. అక్కపాలెం పడమటి వాగు చప్టాపై నుంచి నీరు ప్రవహిస్తుండంతో, రాజుపేటకు చెందిన పలువురు రైతులు ఎగువప్రాంతలో ఉన్న సాగుభూములకు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం నుంచి వరద తగ్గడంతో రాకపోకలు యాధవిధిగా కొనసాగాయి.

ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడిగా కండెల



ఉయ్యూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడిగా కండెల ఆంజనేయులు ఎన్నికయ్యారు. విజయవాడలో గురువారం జరిగిన ఫెడరేషన్ సమావేశంలో కండెల ఆంజనేయులును జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకుంటూ కమిటీ తీర్మానించింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ, ఫెడరేషన్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయక ప్రజలకు బాధ్యతగా సేవలందిస్తానన్నారు. త్వరలో ప్రతిజిల్లాకు వెళ్లి ప్రజల సమస్యలు, అవసరాలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.



చెక్ పవర్ గేమ్!

అక్రమాలు చేశారని అధికారులే నిర్ధారించారు.. సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు.. చెక్ పవర్‌ను తిరిగి పొందటం కోసం పాలకవర్గం ర్యాటిఫికేషన్ ఎత్తుగడ వేసింది.. ర్యాటిఫికేషన్ పేరుతో అక్రమాలన్నీ సక్రమం చేశారు.. రద్దు చేసిన చెక్ పవర్‌ను తిరిగి పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.. జిల్లా పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా మేజర్ గ్రామ పంచాయతీలో మూడేళ్లుగా సాగుతున్న అవినీతి బాగోతాలకు ముగింపు పడటం లేదు.

» మైలవరం పంచాయతీలో భారీగా నిధుల దుర్వినియోగం

» అవకతవకలపై కోర్టుకెళ్లిన వార్డు సభ్యుడు

» చెక్ పవర్ తీయకపోయినా.. తీశామంటూ కోర్టుకు డీపీవో నివేదిక

» అక్రమాలు చేసిన వారిని రక్షించేలా .. డీపీఓ కార్యాలయం తీరు?



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

మైలవరం గ్రామ పంచాయతీ పరిధిలో సాధారణ నిధులు, 15 ఫైనాన్స్ నిధులతో నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్) పద్ధతిన పారిశుధ్యపనులకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. అయితే ఈ పనుల్లో అంతులేని అవినీతి చోటు చేసుకుందని గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుడు ఒకరు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)కు ఫిర్యాదు చేశారు. రూ. 40 లక్షల మేర అవకతవకలు జరిగాయని ఆరోపించారు. తర్వాత కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయటం జరిగింది. పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన నిధులను దారి మళ్లించి సొంత ఖాతాలకు బదిలీ చేసుకున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అప్పటి డీపీవో ఆదేశాల మేరకు మైలవరం విస్తరణ అధికారి (ఈఓపీఆర్‌డీ) విచారణ జరిపి డీపీఓకు నివేదికను ఇచ్చారు.

● నివేదిక ప్రకారం 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలలో జనరల్ ఫండ్స్ రూ. 25.15 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3,50,800 లు కలిపి రూ. 28,65,800లు ఖర్చు చేయటం జరిగిందని నిర్ధారించారు. ఈ ఖర్చులకు సంబంధించిన సీఎఫ్ఎంఎస్ ఐడీలను పరిశీలించగా.. మైలవరం గ్రామ ఉపసర్పంచ్ చామల సీతారామిరెడ్డి ఖాతాలో రూ.12,91,100, సర్పంచ్ మంజుభార్గవి ఖాతాలో రూ.1,50,000, సర్పంచ్ భర్త డానియేల్ వ్యక్తిగత సేవింగ్ ఖాతాలో రూ.2,00,900లు జమ చేసినట్టుగా ధృవీకరించటం జరిగింది. పంచాయతీ వర్కర్ జి.చంద్రరావు ఖాతాలో రూ.3,84,000లు జమ చేసినట్టుగా ధృవీకరించారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి నుంచి అప్పటి కలెక్టర్‌కు నివేదిక వెళ్లిందో లేదో కానీ ఆ తర్వాత విచారణ ముందుకు కదల్లేదు. దీంతో వార్డు సభ్యుడు చిట్టిబాబు ఈ వ్యవహారంపై కోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయస్థానం డీపీవోను వివరణ కోరగా.. సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేసినట్టు కోర్టుకు నివేదించడంతో కేసును కొట్టివేశారు.

● సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశామని కోర్టుకు చెప్పినా.. తర్వాత రద్దు చేయలేదని వార్డు సభ్యుడు కోర్టుకు వెళ్లారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులకు మరో రూ.11.20 లక్షలను దుర్వినియోగం చేశారన్న అభియోగంపై సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేశారు. ఈ పనులు 2021, 2022, 2023లలో పారిశుధ్య పనులు చేసినట్టుగా బిల్లులు చేసుకున్నారని, కార్మికులు జీతాలు తీసుకున్నట్టుగా ఆఫీసు సిబ్బందే వేలిముద్రలు వేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నిధులు కూడా సర్పంచ్, సర్పంచ్ భర్త, ఉపసర్పంచ్ ఖాతాల్లోకి వెళ్లాయన్న ఆరోపణలు వచ్చాయి. అన్నింటినీ పరిశీలించిన మీదట అక్రమాలు జరిగాయని నిర్ధారించిన డీపీవో సర్పంచ్ మంజుభార్గవికి నోటీసు ఇచ్చి.. ఆ తర్వాత ఆమె చెక్ పవర్‌ను రద్దు చేయటం జరిగింది.

● సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయటంతో.. పాలకవర్గం దీనినుంచి బయట పడేందుకు కొత్త ఎత్తుగడ వేసింది. పనులను ర్యాటిఫికేషన్ చేయాలని నిర్ణయించారు. ఇటీవల సమావేశాన్ని ఏర్పాటుచేసి మెజారిటీ సభ్యులు తమ వెంట ఉండటంతో అన్నింటినీ ర్యాటిఫికేషన్ చేయించుకున్నారు. ర్యాటిఫికేషన్ ద్వారా డీపీవోకు రిపోర్టు పంపి చెక్ పవర్‌ను తిరిగి పొందే ప్రయత్నం చేశారు. దీనిపై మరల వార్డు సభ్యుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మూడేళ్ల క్రితం చేసిన అవినీతి పనులకు ఇప్పుడు ర్యాటిఫికేషన్ చేయడమేమిటని, ఇది చెల్లదని తీర్మానాన్ని రద్దు చేయాల్సిందిగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ లక్ష్మీశ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

డీపీవో తీరుతో సాగదీత..

మైలవరం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం వ్యవహారంలో జిల్లా పంచాయతీ అధికారుల పాత్ర వివాదాస్పదమైంది. మైలవరం విస్తరణ అధికారి తొలిదశలో చోటు చేసుకున్న నిధుల దుర్వినియోగానికి సంబంధించి నిర్ధారించి నివేదిక ఇచ్చిన అంశాలపై ఇప్పటి వరకు డీపీవో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చెక్ పవర్ రద్దు చేయకుండా చేశామని కోర్టుకు చెప్పారు. కోర్టు ధిక్కరణకు వెళ్లే క్రమంలో.. మరో కేసును పట్టుకుని అందులో అక్రమాలు జరిగాయని చెక్ పవర్ రద్దు చేశారు. పనులు సవ్యంగానే చేశామని పాలకవర్గం ర్యాటిఫికేషన్ చేసే వరకు వెళ్లింది. పంచాయతీ పాలకవర్గానికి అంటకాగుతూ.. కోర్టు ధిక్కరణ నుంచి తప్పించుకునేందుకు వేసిన ఎత్తుగడ అన్న విమర్శలు వస్తున్నాయి.

పండుగకు ప్రత్యేక రైళ్లు, కొన్ని పొడిగింపు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : లోకమాన్య తిలక్ టెర్మినల్ (ఎల్‌టిటి) ముంబయి-కరీంనగర్ మధ్య పండుగ సీజన్‌ను పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక రైళ్లను కొద్ది రోజులపాటు పొడిగిస్తున్నట్టు పేర్కొన్నారు. 01067, 01068 ఎల్‌టిటి ముంబయి-కరీంనగర్ అప్ అండ్ డౌన్ రైళ్లలో ఈనెల 23న ఎల్‌టిటి ముంబయి స్టేషన్ నుంచి బయలుదేరే రైలు అక్టోబరు 7 వరకు మూడు సర్వీసులు నడుస్తుంది. కరీంగనగర్ నుంచి ఈనెల 24న బయలుదేరే రైలు అక్టోబరు 8 వరకు మూడు సర్వీసులు నడుస్తుంది. ఈ రైళ్లు థానే, కళ్యాణ్, ఇగత్‌పురి, నాసిక్ రోడ్డు, మన్మాడ్, నాగర్‌సోల్, ఔరంగాబాద్, జల్నా, పర్బూర్, సెలు, పర్బనీ, పూర్ణ, నాందేడ్, ముద్కేడ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, ఆర్మూర్, మెట్‌పల్లి, కోరట్ల స్టేషన్లలో ఆగుతాయి. ఈ రైళ్లలో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.



పత్యేక రైళ్ల పొడిగింపు..

03247 ధానాపూర్-ఎస్ఎంవిటి బెంగళూరు గురువారాల్లో బయలుదేరుతుంది. ఈనెల 18 నుంచి డిసెంబరు 25వ తేదీ వరకు 15 సర్వీసులు నడుస్తుంది. 03248 ఎస్ఎంవిటి బెంగళూరు-ధానాపూర్ శనివారాల్లో నడుస్తుంది. ఈనెల 20 నుంచి డిసెంబరు 27వ తేదీ వరకు 15 సర్వీసులు నడుస్తుంది. 03241 ధానాపూర్ - ఎస్ఎంవిటి బెంగళూరు శుక్ర, శనివారాల్లో నడుస్తుంది. ఈనెల 19 నుంచి డిసెంబరు 27 వరకు 30 సర్వీసులు నడుస్తుంది. 03242 ఎస్ఎంవిటి బెంగళూరు - ధానాపూర్ ఆది, సోమవారాల్లో నడుస్తుంది. ఈనెల 21 నుంచి డిసెంబరు 29వ తేదీ వరకు 30 సర్వీసులు నడుస్తుంది.

చర్లపల్లి, అనకాపల్లి మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్ : పండుగ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు చర్లపల్లి, అనకాపల్లి మధ్య ప్రత్యేక రైలును ఈనెల 13వ తేదీ నుంచి నాలుగు సర్వీసుల చొప్పున తిరిగేందుకు ఏర్పాటు చేసినట్టు సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07035 చర్లపల్లి-అనకాపల్లి రైలు శనివారం ఈనెల 13 నుంచి అక్టోబరు 4వరకు నాలుగు సర్వీసులు నడుస్తుంది. 07036 అనకాపల్లి-చర్లపల్లి ఆదివారం ఈనెల 14 నుంచి అక్టోబరు 5 వరకు నాలుగు సర్వీసులు నడుస్తుంది. ఈ ప్రత్యేక రైళ్లు జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి స్టేషన్లలో ఈ రైళ్లు ఆగుతాయి. ఫస్ట్ ఏసీ, టూ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

చేనేత రంగాన్ని ఆదుకోండి

» చేనేత అధ్యయన యాత్ర ప్రారంభించిన సీపీఐ రామకృష్ణ

పెడన, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేనేత రంగానికి జూట్ కొరత కారణంగా ఆ రంగంపై ఆధారపడ్డ కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. చేనేత సమస్యలను తెలుసుకునేందుకు అనుబంధ కార్మిక సంస్థ ఏపీ చేనేత కార్మిక సంఘం చేపట్టిన చేనేత అధ్యయన యాత్రను స్థానిక సర్వోదయ చేనేత సొసైటీ వద్ద గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం సొసైటీలో చేనేత సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత సంఘాలు కార్మికులకు పనులు కల్పించలేకపోతున్నాయన్నారు. చేనేత వృత్తి పరిరక్షణ కోసం, కార్మిక సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత రిజర్వేషన్ చట్టం అమలుకు నోచుకోకపోవడంతో పవర్‌లూమ్స్, టెక్స్‌టైల్ మిల్లులు తయారు చేస్తున్న వస్త్రాలు చేనేత వస్త్రాలుగా చలామణి అవుతున్నాయన్నారు. చేనేత సంఘాలకు బకాయిలు చెల్లించకపోవడంతో అవి నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాయన్నారు. బకాయిలను చెల్లించాలని, సంఘాల నుంచి కొనుగోలు చేసిన వస్త్రాలకు ఎప్పటికప్పుడు సొమ్ము విడుదల చేయాలని, త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. కాగా రామకృష్ణకు సంఘాల ప్రతినిధులు చేనేత సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో కట్టా హేమసుందరరావు, పేరిశెట్టి ఉమాకాంతం, బండారు ఆనందప్రసాద్, మోదుమూడి రామారావు, పీతాంబరేశ్వరరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, గుడిసే రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



చేనేత అధ్యయన యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న రామకృష్ణ

యూరియాపై రచ్చ!

(5వ పేజీ తరువాయి)

సభ్యురాలు రత్నకుమారి ఆరోపించారు. పెదపారుపూడి, నందిగామ మండలాల్లో అరకొరగానే యూరియాను ఇచ్చారని, కొత్తగా ఎంపికైన పీఏసీఎస్‌ల అధ్యక్షులు తమకు అనుకూలమయిన రైతులకు యూరియా ఇచ్చి, మిగిలిన రైతులకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపులపాడు మండలం రేమల్లె, గన్నవరం పీఏసీఎస్‌లకు సక్రమంగా యూరియా పంపలేదని జెడ్పీటీసీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బంటుమిల్లి మండలంలో బల్లిపర్రు, కంచడం, బంటుమిల్లి పీఏసీఎస్‌ల పరిధిలో 18 గ్రామపంచాయతీలు ఉన్నాయని, యూరియా సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ మహేష్ అన్నారు. ఇటీవల బంటుమిల్లి మండలానికి సరిపడా యూరియా ఇవ్వాలని ఆర్డీవోకు రైతులంతా వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోలేదని చెప్పారు. బంటుమిల్లి మండలానికి యూరియా ఇస్తామని జేసీ గీతాంజలిశర్మ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కంచికచర్ల మండలంలో ఐదు వేల టన్నుల యూరియాను ఇవ్వాల్సి ఉండగా, కేవలం 1100 టన్నులను మాత్రమే ఇచ్చారని, బయటి మార్కెట్‌లో బస్తా రూ.450, అంతకు మించి ధరతో రైతులు కొనుగోలు చేస్తున్నారని కంచికచర్ల జెడ్పీటీసీ తెలిపారు. మిగిలిన మండలాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు యూరియా కొరతపై రైతులు పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు.

కొరత లేదని అనడంతో పోడియం వద్దకు దూసుకెళ్లిన సభ్యులు

యూరియా కొరతపై జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు అధికారులను ప్రశ్నిస్తూ ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత ఉందా లేదా అనే అంశంపై స్పష్టమైన సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ శాఖ జేడీ విజయకుమారి స్పందిస్తూ జిల్లాలో యూరియా కొరత లేదని అన్నారు. దీంతో సభ్యులంతా ఒక్కసారిగా పోడియం వద్దకు వెళ్లి అధికారులతో వాగ్వాదానికి దిగారు. మీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు తప్పుడు సమాచారం ఇచ్చి రైతులను ఇబ్బందులపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 20 నిమిషాల పాటు సభ్యులంతా పోడియం ఎదుట నిలబడి ఆందోళన చేశారు. కృష్ణా కలెక్టర్ బాలాజీ సభ్యులకు సర్దిచెప్పినా వారు పట్టించుకోలేదు. కలిదిండి మండలం క్యాంప్‌బెల్ కాల్వకు పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదల చేయాలని సభ్యులు కోరారు. కంచికచర్ల మండలం తవ్వకాల్వకు గండ్లు పడ్డాయని, వాటిని పూడ్చేందుకు రూ.1.20కోట్ల నిధులు విడుదలైనా పనులు చేయడం లేదని కంచికచర్ల ఎంపీపీ ఎం.గాంధీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వరదల వల్ల పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, వాటిని తొలగిస్తుంటే రైతులపై కేసులు పెడుతున్నారని తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడిచేసిన వారిపై చర్యలేవీ?

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై గుడివాడలో దాడి చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. మూడు నెలలుగా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ బాలాజీ స్పందించారు. వెంటనే ఎస్పీ గంగాధరరావుతో ఫోన్‌లో మాట్లాడారు. తాను ఎస్పీతో మాట్లాడానని, ఈ ఘటనపై కేసు నమోదు చేశారని, త్వరలో తగు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. జెడ్పీ నిధులతో చేపట్టే పనులకు నిధులు ఇచ్చిన జెడ్పీటీసీ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా ప్రారంభోత్సవాలు చేస్తున్నారని, ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని జెడ్పీ చైర్మన్‌తో పాటు సభ్యులంతా కలెక్టర్‌కు వివరించారు.

జెడ్పీటీసీ సభ్యుల గౌరవ వేతనం విడుదలకు ఆమోదం

గత 18 నెలలుగా జెడ్పీటీసీ సభ్యులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం రూ.74.93 లక్షలను జెడ్పీ జనరల్ ఫండ్ నుంచి విడుదల చేసేందుకు ప్రభుత్వం ఇటీవల అనుమతులు ఇవ్వడంతో, గౌరవ వేతనాన్ని విడుదల చేసేందుకు సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, నూజివీడు సబ్‌కలెక్టర్ వినూత్న, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.



రోడ్డుపై రక్తపు మడుగులో మృతుడు సుబ్రహ్మణ్యం

నెత్తుటి ధారులు!

» వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మోపిదేవి/పామర్రు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైస్‌స్మార్ట్ కార్డు తీసుకునేందుకు మచిలీపట్నం నుంచి గుంటూరు జిల్లా కొల్లూరుకు ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని నాగాయలంక వైపు నుంచి రొయ్యల లోడుతో వస్తున్న కంటైనర్ బుధవారం రాత్రి మోపిదేవి శివారులో ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గుంటూరు జిల్లా కొల్లూరు గ్రామానికి చెందిన గొరిపర్తి సుబ్రహ్మణ్యం (30) మచిలీపట్నంలో తాపీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రేషన్ స్మార్ట్‌కార్డు తీసుకునేందుకు మచిలీపట్నం నుంచి కొల్లూరుకు మోటారు బైక్‌పై వెళుతుండగా.. నాగాయలంక నుంచి రొయ్యల లోడుతో విశాఖపట్నం వెళుతున్న కంటైనర్ మోపిదేవి శివారులో బలంగా ఢీకొట్టింది. సుబ్రహ్మణ్యం తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, వీఆర్వో బొడ్డు శ్రీనివాసరావు పంచనామా నిర్వహించారు. మోపిదేవి ఎస్ఐ వై.వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



మృతుడు రామదాసు

పామర్రు మండలం నిడుమోలు గ్రామానికి చెందిన చిగురుపాటి రామదాసు(68), మల్లికార్జునరావుతో కలిసి గురువారం సమీప గ్రామమైన నిమ్మలూరులో దశ దినకర్మకు నిడుమోలు నుంచి మోటారు సైకిల్‌పై వెళుతుండగా బందరునుంచి వేగంగా వస్తున్న కారు బెల్ కంపెనీ మలుపు వద్ద వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో రామదాసు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మల్లిఖార్జునరావుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్, ట్రైనీఎస్సై సత్యకళ ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రుడిని బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామదాసు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అన్నమ్మ దివ్యాంగ ఆశ్రమం ఎదుట ఆందోళన చేస్తున్న బాలుడి తల్లిదండ్రులు, గ్రామస్థులు, సన్ని (ఇన్‌సెట్)

ఆశ్రమ నిర్వాహకులే చంపేసి ఉంటారు!

» బాలుడి అదృశ్యంపై తల్లిదండ్రుల ఆందోళన

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తమ బిడ్డను అన్నమ్మ దివాంగుల ఆశ్రమ నిర్వాహకులే చంపేసి ఉంటారని దైదా సన్ని (దివ్యాంగుడు) తల్లిదండ్రులు జ్యోత్స్న, జ్యోతిరాజులు ఆరోపించారు. పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన సన్ని ఇబ్రహీంపట్నంలోని అన్నమ్మ దివ్యాంగుల ఆశ్రమంలో ఉంటూ టెన్త్ చదువుతున్నాడు. ఈనెల ఎనిమిదో తేదీ నుంచి బాలుడు అదృశ్యమయ్యాడు. ఆశ్రమ యజమానే తమ బిడ్డను చంపేసి ఉంటారని గురువారం బాలుడి తల్లిదండ్రులు, గ్రామస్థులతో కలిసి ఆశ్రమం ఎదుట ఆందోళనకు దిగారు. కొడుకు తప్పిపోతే తమకు చెప్పాలని, ఒకవేళ బయటకు వెళితే సీసీ కెమెరాల్లో నమోదవుతుందని చెప్పారు. సీఐ ఎ.చంద్రశేఖర్ ఆశ్రమ సిబ్బందిని ప్రశ్నించారు. ఆశ్రమ యజమాని అందుబాటులో లేరని, వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో విచారణ చేసి బాలుడి ఆచూకీ కనుగొంటామని సీఐ బాలుడి తల్లిదండ్రులకు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరించారు.

దసరా డబుల్ డ్యూటీ

(5వ పేజీ తరువాయి)

ఒక వ్యక్తికి విధులు కేటాయించి, రోజుకు ముగ్గురికి డ్యూటీ వేశారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు రెండో షిఫ్ట్, రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు నైట్ షిఫ్ట్‌గా నిర్ణయించారు. డ్రాఫ్ట్ సెక్షన్‌లోని 26 సెక్టార్‌లలో విధులు కేటాయించిన ఉద్యోగికే, మరలా ఇంజనీరింగ్‌లోని 43 విభాగాల్లో విధులు కేటాయించేశారు. అదీ ఒకే షిఫ్ట్‌లో కేటాయించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకూ రాత్రి విధులు

వయసుపైబడి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగులకు రాత్రి సమయంలో విధులు కేటాయించడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం కక్షసాధింపు ధోరణితోనే వీఎంసీ అధికారులు ఈ తరహా ఉత్తర్వులు జారీ చేశారని మండిపడుతున్నారు. సచివాలయంలో పని చేసే యువతకు ఎలాంటి విధులు కేటాయించకుండా 50 ఏళ్లు పైబడి బీపీ, షుగర్, కిడ్నీ తదితర వ్యాధులతో బాధపడుతున్న తమనే విధులకు పంపాలనుకోవడం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు. అస్పష్టంగా, అనాలోచితంగా, కక్షసాధింపుతో ఉన్న ఉత్తర్వులను మరోసారి పరిశీలించి, ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వరి దిగుబడి ప్రశ్నార్థకం!

(5వ పేజీ తరువాయి)

రైతులు యూరియా వాడకాన్ని విపరీతంగా పెంచారు. వరి పంటలో ఎకరాకు మూడు దశల్లో 15 కేజీల చొప్పున కేవలం బస్తా యూరియా వాడాలని వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నా రైతులు పట్టించుకోవడం లేదు. మూడు దశల్లో కలిపి రెండున్నర నుంచి మూడు బస్తాల వరకు వాడేస్తున్నారు. యూరియాతో పాటు అమోనియం వాడకం విపరీతంగా పెరిగింది. సాధారణంగా రైతులు మూడో దశలో అమోనియం వినియోగిస్తారు. కంకి పూర్తిస్థాయిలో బయటకు వచ్చేందుకు మొక్కకు తక్షణ బలాన్ని చేకుర్చేందుకు అమోనియా ఉపయోగపడుతుందని రైతులు విశ్వసిస్తారు. అమోనియం అధిక వాడకం కూడా భూసారానికి చేటు అని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

తగ్గనున్న దిగుబడి

కేవలం యూరియా వాడకంతో వరి ఏపుగా పెరగడం తప్పా ఎటువంటి బలం ఉండదని, కంకి పూర్తిస్థాయిలో విడుదల అవ్వాలంటే భూమిలో బలం ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. దీంతో పాటు ధాన్యంలో నాణ్యత తగ్గుతుందని, తప్ప, తాలి శాతం ఎక్కువగా వచ్చే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ఎక్కువ శాతం కౌలు రైతులు కావడంతో పంట పండించి వెళ్లే ఆలోచన తప్పా భూసారంపై దృష్టి పెట్టడం లేదని పేర్కొంటున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

వైసీపీవి నీచ రాజకీయాలు : దేవినేని రాజా

కంకిపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా విమర్శించారు. కంకిపాడులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతపురంలో సూపర్ సిక్స్..సూపర్ హిట్ విజయంతో వైసీపీ నాయకులకు మతి భ్రమించింద న్నారు. వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి నుంచి స్థానిక వైసీపీ నాయకుల వరకు కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఏడాదిన్నర కాలంలో సుమారు రూ.4500 కోట్లతో పల్లె పండుగ కార్యక్రమంలో రహదారుల అభివృద్ధి చేయడం జరిగిందని తెలియజేశారు. ఇంత అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని విమర్శించటం సిగ్గు చేటన్నారు. ఈడుపుగల్లు సర్పంచ్ పి. ఇందిర, పార్టీ నాయకులు సుధాకర్, షేక్ షకార్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఇంచార్జి హెచ్ఎం రమణగోపాల్, పీడీ వెంకటరంగారావు

వీరవల్లి విద్యార్థుల ప్రతిభ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వీరవల్లి హైస్కూల్ విద్యార్థులు షూటింగ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎం మానుకొండ రమణగోపాల్ విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీడీ కోలా వెంకట రంగారావును అభినందించారు. ప్రతిభ కనబరచి ప్రకాష్, యశ్వంత్, సాయిప్రకాష్, జెస్సిన్, కార్తీక్, దేవిప్రియ, ధరణిలక్ష్మి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. నెల్లూరులో జరుగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.


గొల్లనపల్లి హైస్కూల్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎస్టీయు నాయకులు

12వ పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను నియమించాలి

గన్నవరం : పీఆర్సీ 12వ కమిటీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి డి.విద్యాసాగర్ డిమాండ్ చేశారు. గొల్లనపల్లి, బీబీగూడెం, కొండపావులూరు, కట్టుబడిపాలెం, గోపవరపుగూడెం, వివిఎస్‌పురం కాలనీలోని పాఠశాలలో గురువారం ఎస్టీయూ సభ్యత్వం నమోదు చేయించి సమస్యలు తెలుసుకున్నారు. విద్యాసాగర్ మాట్లాడుతూ 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి పెట్టకపోవటం విచారకరమన్నారు. ఎస్టీయూ జిల్లా నాయకులు అనిల్ బాబు, ఎస్.అశోక్, బి.శ్రీధర్, అబ్దుల్ బషీర్, ఎం.ఆనంద్‌కుమార్, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఫైనల్ పోటీలకు అర్హత సాధించిన టీం సభ్యులతో యాజమాన్యం

క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ ఫైనల్లో వీఆర్ విద్యార్థినులు

పెనమలూరు : గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025 పోటీల సెమీఫైనల్లో వీఆర్ సిద్ధార్థ యూనివర్సిటీ విద్యార్థినుల జట్టు విజయం సాధించి ఫైనల్లో ప్రవేశించిందని యాజమాన్యం తెలిపింది. మొదటి స్థానంలో నిలిచిన యూనివర్సిటీ టీం రూ.15 వేల ప్రథమ బహుమతిని సాధించి త్వరలో జరగనున్న ఫైనల్ పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు. ఫైనల్ పోటీలకు తలపడే టీంలో పి. శ్రీహాసిని, బి.ఉదిత, కె. జాహ్నవి, డి. పల్లవి, ఎం.ప్రవల్లిక, పి.జస్విత సభ్యులుగా ఉంటారని తెలిపారు.


గుంతల మయంగా జబర్లపూడి రోడ్డు

అధ్వానంగా జబర్లపూడి రోడ్డు

ఉయ్యూరు : మద్రివాడ నుండి జబర్లపూడి వెళ్లే జిల్లాపరిషత్ రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడి ద్విచక్రవాహనాలు సైతం వెళ్లక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పొలాల మధ్య బాహ్యప్రపంచానికి దూరంగా విసిరి వేసినట్టు ఉండే జబర్లపూడి గ్రామం ఎంతో చారిత్రాత్మకమైనది. బయటకు రావాలంటే గ్రామస్థులకు ఇదే రోడ్డు కావడంతో గుంతలు, వాటిల్లో నిలిచిన వర్షపు నీటితో రాత్రివేళ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు దుస్థితిని జిల్లాపరిషత్‌లో తెలియజేసి అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువచ్చేందుకు జడ్పీటీసీ స్థానం సంవత్సరాల తరబడి ఖాళీగా ఉండటంతో పట్టించుకున్న వారు లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పోరంకి టీడీపీ కార్యాలయంలో తోపుడు బళ్లను అందిస్తున్న బోడె వెంకట్రాం తదితరులు

నిరుపేదల అభివృద్ధికి దాతలు తోడ్పాటు అందించాలి

పెనమలూరు : సమాజంలో నిరుపేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు వచ్చి తోడ్పాటు అందించాలని టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్ పిలుపునిచ్చారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో తాడిగడప మునిసిపాలిటీలోని యనమలకుదురు గ్రామానికి చెందిన కొండా వెంకటమ్మ, గోనా నాగలక్ష్మిలకు తోపుడు బళ్లు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. సమాజంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆదాయం తక్కువగా ఉండడంతో వారికి ఉన్నత వర్గాల సహకారం తప్పనిసరిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, పాదాల ప్రభాకరరావు, బొంగరాల అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా సెంట్రల్ లైటింగ్

- ఏడాదిన్నర గడిచిన వెలగని వైనం
- మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు

(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి): జంక్షన్ ప్రధాన రహదారులపై నెలకొల్పిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ అలంకార ప్రాయంగా మారింది. కోట్లాది రూపాయల వ్యయంతో స్తంభాలు ఏర్పాటు చేసి ఏడాదిన్నర కాలం గడిచినా ఇప్పటి వరకు లైట్లు వెలిగించకపోవడంతో విద్యుత్ స్తంభాలు వెలవెల పోతున్నాయి. విద్యుత్ సరఫరా కనెక్షన్ ఇప్పించడంలో అధికారుల జాప్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 16వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జంక్షన్ బైపాస్ ఏర్పడిన తరువాత 2023లో ప్రధాన రహదారి (ఏలూరు-విజయవాడ రోడ్డు)కు మరమ్మతు జరిపి ఆర్ అండ్‌బీ కి అప్పగించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైవే నిధుల నుంచి రూ.9కోట్లు మంజూరు చేసింది. మూడు కిలో మీటర్ల మేర రహదారి అభివృద్ధితో పాటు డివైడరుపై సెంట్రల్ లైటింగ్ కోసం 150 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. జంక్షన్ నాలుగు రోడ్ల కూడలి, మూలకొట్టు సెంటర్, వేలేరు అడ్డరోడ్డు, అప్పనవీడు డివైడర్ల వద్ద భారీ సైజు హైమాస్ట్ ల్యాంప్‌లు కూడా ఏర్పాటు చేశారు. ఇది 2024 ఎన్నికల ముందు జరిగింది. ఒడిసాకు చెందిన అబిత్రా సంస్థ కాంట్రాక్టు తీసుకొని ఎన్నికలు ముందు మే నెలలో పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ వ్యవస్థను కూడా పూర్తి చేసింది. స్తంభాలు ఏర్పాటు చేసి దాదాపు ఏడాదిన్నర కాలం గడిచిన విద్యుత్ సరఫరా కనెక్షన్ ఇప్పించి లైట్లు వెలిగించడానికి ఆర్ అండ్ బీ శాఖ అధికారులు చొరవ చూపడం లేదు. ఏలూరు రోడ్డులో ఏర్పాటు చేసిన స్తంభాలు ఏలూరు జిల్లా అప్పనవీడు గ్రామం పరిధిలో, విజయవాడ రోడ్డులో ఏర్పాటు చేసిన స్తంభాలు బాపులపాడు, వేలేరు గ్రామాల పరిధిలో ఉన్నాయి. నిర్వహణ బాధ్యత ఎవరికి అప్పగించాలన్న సందిగ్ధావస్థలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. విద్యుత్‌సరఫరా ఇవ్వకపోవడంతో పాటు వాటి నిర్వహణ బాధ్యతను ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించకపోవడంతో స్తంభాలు శిథిలమవుతున్నాయి. ఇప్పటికే విజయవాడ రోడ్డు, గుడివాడ, నూజివీడు రోడ్డులో కొన్ని స్తంభాలు నేలకొరిగాయి. ఇదే అలసత్వం కొనసాగితే పూర్తిగా శిథిలమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో విద్యుత్ కాంతులతో జంక్షన్ ప్రధాన మార్గం శోభాయామానంగా ఉంటుందని భావించిన ప్రజానీకం ఆశలు క్రమేణా అడియాశలవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని సెంట్రల్ లైటింగ్ వ్యవస్థకు విద్యుత్ కెనక్షన్ ఇచ్చి లైట్లు వెలిగించాలని ప్రజానీకం కోరుతున్నారు.


జంక్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ ల్యాంప్ పోల్


నూజివీడు రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో నేలకొరిగిన స్తంభం


విజయవాడ రోడ్డులో నేలకొరిగిన స్తంభం

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు సాయి ప్రశాంత్

గన్నవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-19 ఫెన్సింగ్ పోటీలకు మల్లిఖార్జున హైస్కూల్ విద్యార్థి మానికొండ సాయి ప్రశాంత్ ఎంపికైంది. ప్రిన్సిపాల్ దాసరి మాధవిలత ఈ సందర్భంగా సాయి ప్రశాంత్‌ను అభినందించారు. అక్టోబర్‌లో గుంటూరు లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పిఈటి వంశీకృష్ణ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు మల్లికార్జునస్వామి దేవాలయం ప్రాంగణంలో నూతనంగా చేపట్టిన అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి బాపులపాడు కృష్ణానగర్ కాలనీ వాసులు రూ10,11 విరాళం కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నాకు అందజేశారు. ఎన్నారై దోణవల్లి మురళీ ఆలయ అభివృద్ధికి రూ.1,01,116 విరాళం అందజేసినట్లు చైర్మన్ చిన్నా తెలిపారు. ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చి విరాళాలను అందజేస్తున్న దాతలను కమిటీ తరఫున అభినందనలు తెలియజేశారు. సభ్యులు వీరమాచనేని నాగయ్యకొల్లి వెంకట్రావు, తమిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీకాంత్ పారస్కర్

గన్నవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేయాలని ఎన్ఆర్ఎల్ఎం జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీకాంత్ పారస్కర్ అన్నారు. మండల సమైక్య వెలుగు కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. బుక్ కీపర్‌లు, వీవో ప్రెసిడెంట్‌లతో ముఖాముఖి మాట్లాడారు. లక్ష్మీకాంత్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు అతితక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనిట్‌లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగడంతో పాటు పలువురికి ఉపాధి చూపించే విధంగా చొరవ చూపాలన్నారు. నాగలక్ష్మీ ఫర్నిచర్, కొవ్వూరు హేమ బోటిక్ డిజైనింగ్ వర్క్, షేక్ హిమాంబి వన్‌గ్రామ్ గోల్డ్ వ్యాపారం చేస్తున్నట్లు వివరించారు. యూనిట్లను పరిశీలించిన లక్ష్మీకాంత్ సంతృప్తి వ్యక్తం చేశారు. మండల సమైక్య అధ్యక్షురాలు కోనేరు రమామణి, కార్యదర్శి దేవరపల్లి సుశీల, కోశాధికారి పద్మ, కొమ్మినేని నీరజ, ఐబీ డీపీఎం సత్యభామ, డీపీఎం సుధాకర్, విజేత, సెర్ప్ ఐబీ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, వాల్మీకీ, శోభారాణి, వర ప్రసాద్, ఏబీఎం సాంబశివరావు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీకాంత్ పారస్కర్

చికిత్సపొందుతూ మహిళ మృతి

పెనమలూరు, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి) : చీరెకు నిప్పంటుకొని కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొం దుతున్న కానూరుకు చెందిన మహిళ మృతి చెందింది. మంచినేని స్వరూపరాణి (50) చీరెకు స్టౌ మంట అంటుకొని కాలిన గాయాలయ్యాయి. ఆమెను కుమార్తె విజయ ఆసుపత్రికి తరలించారు. వారంపాటు చికిత్స చేసి డిశ్చార్జి చేశారు. కాలిన గాయాలకు ఇన్ఫెక్షన్ సోకడంతో గతనెల 26న మరో ఆసుపత్రిలో చేర్పించిగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

వెంకట్రామ్ చొరవతో అంగన్వాడీ కేంద్రం నిర్మాణం పూర్తి

పెనమలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై అటకెక్కిన వణుకూరు అంగన్వాడీ కేంద్ర నిర్మాణ పనులు యువనేత బోడె వెంకట్రాం చొరవతో పూర్తయ్యాయి. మసీదు వద్ద గత ప్రభుత్వంలో అంగన్వాడీ కేంద్రం నిర్మాణం ప్రారంభించారు. అరకొర పనులతో నిర్మాణం పెండింగ్‌లో పడింది. గ్రామస్థులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను ఆశ్రయించారు. ఇది తెలుసుకొన్న యువనేత వెంకట్రామ్ అంగన్వాడీ పనులను డబ్బుతో పూర్తి చేసి దానికి పెయింటింగ్ పనులు కూడా పూర్తి చేసి చిన్నారులకు అందుబాటులోకి తెచ్చారు. గ్రామస్థులు వెంకట్రామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

పెనమలూరు : పెదపులిపాకకు చెందిన ఒడుగు రాఘవేంద్రరావు పటమటలంకలో వడ్రంగి పని చేసి ఇంటికి బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెనమలూరు గ్రామానికి చెందిన రామదాసు పెంటయ్య భార్యతో కలిసి బైక్‌పై వస్తుండగా మరో బైక్ ఢీకొని ఇద్దరూ గాయపడ్డారు. పెంటయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవీ దశమ రాత్రుల పోస్టర్ ఆవిష్కరణ


-దేవీ దశమ రాత్రుల పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న జాస్తి శ్రీధర్, కమిటీ సభ్యులు

గన్నవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 22 నుంచి 2వ తేదీ వరకూ దేవీ దశమ రాత్రుల మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. ఆలయ కల్యాణ మండపంలో కమిటీ సభ్యులతో కలసి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, స్వచ్ఛంద్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధరావు, ముసునూరు రత్నబోస్ పాల్గొంటారని తెలిపారు. ఆలయ కోశాధికారి జాస్తి పణిశేఖర్, కార్యదర్శి కాసన్నేని వెంకటేశ్వరరావు(నాని), జాస్తి శ్రీనివాసరావు, మోదుగుమూడి వేణుగోపాలరావు, చిమట శ్రీనివాసరావు, పెడసనగంటి రామేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి రోడ్డును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

గన్నవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గన్నవరం-ఆగిరిపల్లి రోడ్డును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. రోడ్డును పూర్తి చేయాలని కోరుతూ గొల్లనపల్లి నుంచి గురువారం పాదయాత్ర చేశారు. కళ్లం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం రోడ్డు అభివృద్ధికి రూ.29కోట్లు వచ్చాయన్నారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిధులు వెనక్కి వెళ్లాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు పునః ప్రారంభించి పూర్తి చేయకుండా అసంతృప్తిగా వదిలేశారని చెప్పారు. పాలకులు రోడ్డు అభివృద్ధిపై దృష్టి సారించి పూర్తి చేయాలని కోరారు. వామపక్ష నాయకులు చాగంటిపాటి కోటేశ్వరరావు, వెంగల రంగారావు, శివయ్య, బెనర్జీ, చిన కోటయ్య, మల్లంపల్లి ఆంజనేయులు, శివాచారి, మిరప నాగేశ్వరరావు, బెజవాడ తాతబ్బాయి, సూరగాని సాంబశివరావు, మీరావలి, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లనపల్లి నుంచి గన్నవరం వరకూ పాదయాత్ర చేస్తున్న వామపక్ష నాయకులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మి

గుడివాడ : మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని , నార్కోటిక్స్ డ్రగ్స్‌కు సంబంధించిన వాటి లభ్యత గురించి సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని గుడివాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.జయలక్ష్మీ అన్నారు. గురువారం స్థానిక ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు సంబంధిత మందుల వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ యలమంచిలి రెడ్డియ్య చౌదరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్రరావు, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల అగచాట్లు


కాటూరు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఉయ్యూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యూరియాకోసం రైతులు పీఏసీఎస్‌ల వద్ద బారులు తీరారు. కడుతున్నారు. సొసైటీలకు యూరియా లోడు వచ్చిందన్న సమాచారంతో ఉదయాన్నే చేరుకుని అధికారులు వచ్చే వరకు పడిగాపులు పడుతున్నారు. కాటూరు సొసైటీకి గురువారం యూరియా రావడంతో రైతులు ఉరుకులుపరుగులు మీద అక్కడకు చేరుకుని వ్యవసాయ అధికారులిచ్చే టోకెన్ల కోసం బారులు తీరారు. సొసైటీకి 25 టన్నులు యూరియా రాగా తొలుత 150 మందికి టోకెన్ ఇచ్చారు. టోకెన్లు అందని రైతులు ఆందోళనకు దిగారు. తీసుకున్న వాళ్లే తీసుకుంటున్నారని, పలుకుబడి కలిగిన వాళ్లకుయూరియా ఇస్తున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాకు ఉన్నంత వరకు అందరికీ సర్దుతామని, రైతులు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ సురేశ్‌కుమార్, వ్యవసాయ సహాయకురాలు మణిమాల నచ్చచెప్పి శాంతింప చేశారు. టోకెన్లు తీసుకున్న వారికి వేలిముద్ర తీసుకునేందుకు మధ్యాహ్నం వరకు ఐడీ రాకపోవడంతో రైతులు పడిగాపులు కాశారు. పలుకుబడి ఉపయోగించి తీసుకున్న వారు రెండు రోజుల తరువాత రూ.540కు అమ్ముకుంటున్నారని కొందరు రైతులు ఆరోపించారు.

యూరియా కొరత లేదు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మండల వ్యాప్తంగా యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందకుండా అవసరానికి మాత్రమే యూరియా వాడాలని మండల వ్యవసాయశాఖ అధికారి బి.రంగనాథ్‌బాబు సూచించారు. కాకులపాడులో గురువారం యూరియాపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. నానో యూరియాపై అవగాహన కల్పిస్తూ యూరియా వాడకంపై రైతులకు సూచనలిచ్చారు. సీజన్‌కు సరిపడా వరి పంటకు అవసరమైన యూరియా సరఫరా చేస్తామన్నారు. వర్షం పడుతున్నప్పుడు యూరియా వాడొద్దని, తగ్గిన తరువాత రెండు రోజుల గడువులో యూరియా వాడాలని సూచించారు. వచ్చే సీజన్‌కు కూడా యూరియా అందుబాటులో ఉంటుందని ఆందోళన చెందవద్దన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేలా నానో ఎరువులను వాడాలని సూచించారు. వీఏఏ, సూరపనేని రంగారావు, తదితర రైతులు పాల్గొన్నారు.


యూరియా ఔట్రీచ్‌లో భాగంగా రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రంగనాథ్‌బాబు

నగరంలో ఆర్‌వో ప్లాంట్ల రిపోర్టులను పరిశీలించండి

● ట్రేడ్ లైసెన్స్, వాటర్ టెస్టింగ్ తాజా ల్యాబ్ రిపోర్టులు లేకుంటే మూసేయండి

● కమిషనర్ ధ్యానచంద్ర



కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆర్‌వో వాటర్ ప్లాంట్ల నీటి శుద్ధత ల్యాబ్ రిపోర్టులు పరిశీలించాలని, ట్రేడ్ లైసెన్స్, తాజా ల్యాబ్ రిపోర్టులు ఏది లేకపోయిన వెంటనే ప్లాంట్‌ను మూసివేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం శాఖాధిపతులు, ప్రజారోగ్య విభాగం సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజారోగ్య విభాగంలో అధికారులందరూ తమ పరిధిలోని ఆర్‌వో ప్లాంట్ల ద్వారా తాగునీటి సరఫరా వ్యాపారులను గుర్తించి, ట్రేడ్ లైసెన్స్ నీటి పరీక్షల ల్యాబ్ రిపోర్ట్‌లు ఏది లేకపోయిన ఆర్‌వో ప్లాంట్లను మూసివేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ల్యాబ్ రిపోర్ సక్రమంగా ఉందని నిర్ధారించుకున్న తరువాత తాగునీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. సాయంత్రానికల్లా నగర పరిధిలో అటువంటివి ఎన్ని దుకాణాలున్నాయి, వాటి నివేదిక తమకు సమర్పించాలని ఆదేశించారు.

ఆర్‌ఆర్‌పేటలో సరఫరా నీళ్లు వాడకానికి మాత్రమే..!

కొత్త రాజరాజేశ్వరిపేటలో పైప్ లైన్లు ద్వారా సరఫరా అవుతున్న నీళ్లను వాడకానికి మాత్రమే ఉపయోగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాగునీటి కోసం టాంకర్ల ద్వారా సరఫరా చేస్తారని, తాగునీటిని కాచి చల్లార్చిన తర్వాతే తాగాలని కమిషనర్ పేర్కొన్నారు.

డయేరియా కేసులపై అప్రమత్తం

అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష

కలెక్టరేట్/అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరీ పేటలో డయేరియా కేసులపై పూర్తి అప్రమత్తంగా ఉన్నామని, బాధితులకు మెరుగైన వైద్యం అందజేస్తున్నామని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, వదంతులు నమ్మొద్దని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం ఆయన న్యూ రాజరాజేశ్వరీపేటలో పర్యటించి, డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించారు. స్థానిక మెడికల్ క్యాంపును సందర్శించి బాధితులకు అందుతున్న వైద్యసేవలను ఆరా తీశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, పారిశుద్ధ్యం మెరుగుపరచి


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

వ్యాధి ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రం (సీసీసీ)లో మంత్రి నారాయణ, కలెక్టర్ లక్ష్మీశ, పురపాలక శాఖ సంచాలకుడు పీ సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి వైద్యారోగ్యశాఖ, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డయేరియా ప్రబలకుండా ఇప్పటికే తీసుకొన్న చర్యలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ రాజరాజేశ్వరీపేటలో ముందు జాగ్రత్తగా కుళాయి నీటి సరఫరా ఆపేసి ట్యాంకర్లు, వివిధ మార్గాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఇప్పటికే అధికారుల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించామని, కాచి వడపోసిన నీటిని తాగడం వంటి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించినట్టు వెల్లడించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు, న్యూ జీజీహెచ్‌లో బాధితులకు వైద్యం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఒకసారి నీటి నమూనాలను పరీక్షించామని, లోపాలు కనిపించలేదని, మరిన్ని పరీక్షల ద్వారా సమస్యకు అసలు కారణాలను విశ్లేషించే పనిలో ఉన్నట్లు పేర్కొన్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ప్రభుత్వాసుపత్రికి బాధితుల తరలింపు

న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతంలో వాం తులు, విరేచనాలతో బాధపడుతున్నవారికి అ ధికారులు మెరుగైన చికిత్సను అందిస్తున్నారు. సాధారణ రోగులకు స్థానిక మెడికల్ క్యాంపులో చికిత్స అందిస్తుండగా వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనిపించిన బాధితులను నగరంలోని సర్వజన ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నారు. 3 రోజుల వ్యవధిలో 70 మంది ఆసుపత్రుల పాలయ్యారు. గురువారం ఒక్కరోజే వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య 194కు చేరింది. వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు చెప్పారు. బాధితుల రక్త నమూనాలను ల్యాబ్‌లకు పంపించామని, వ్యాధి లక్షణాలకు గల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

కంట్రోల్ రూమ్ నంబరు 9154970454 : కలెక్టర్

డయేరియా కేసుల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పరిస్థితి చక్కదిద్దేందుకు, సమన్వయానికి రెవెన్యూ, వివిధ శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నట్టు వెల్లడించారు. బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని, డయేరియా మరణాలు సంభవించినట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. ప్రత్యేక బృందాలతో తాగునీటి సరఫరా పైపులైన్ల వ్యవస్థలకు క్షుణంగా పరిశీలిస్తున్నామన్నారు. కేర్ అండ్ షేర్ స్కూల్లోని మెడికల్ క్యాంపు అత్యంత సమర్థవంతంగా సేవలందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ర్యాపింగ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో ఎం లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి: మల్లాది విష్ణు, బాబూరావు

న్యూ రాజరాజేశ్వరిపేట డయేరియా బాధితులను మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సీపీఎం నేత సీహెచ్ బాబూరావు విడివిడిగా పరామర్శించారు. డయేరియా లక్షణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే న్యూ ఆర్‌ఆర్‌పేటలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని మంచినీటి సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. తక్షణం పారిశుధ్యం, మంచినీటి సరఫరా మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.


రొయ్యల చెరువు

రొయ్యి రైతుకెంత కష్టం!

● అమెరికా సుంకాల ప్రభావంతో ధర దిగాలు ● అమాంతం పడిపోయిన 100, 40, 30 కౌంట్ రొయ్యలు

● తగ్గని సీడ్, ఫీడ్, విద్యుత్ ధరలు ● సాగు ఖర్చులు పెరిగి, రాబడి తగ్గడంతో రైతుల అయోమయం ● సాగుకు స్వస్తి చెప్పేందుకు ఉమ్మడి కృష్ణా రైతుల సమాయత్తం

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: అంతర్జాతీయ మార్కెట్ ఒడుదుడుకులు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని రొయ్యల సాగును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఎగుమతులు తగ్గిపోవడంతో ధర నెమ్మదిగా నేల చూపులు చూస్తోంది. క్రమక్రమంగా తగ్గుతున్న ధరలు రైతులను తీవ్ర నిరాశకు గురి చేస్తున్నాయి. కనీసం ఖర్చులైనా రాని పరిస్థితులు నెలకొనడంతో రొయ్యల సాగుకు స్వస్తి చెప్పేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇదే ధర ఉంటే రూ.లక్షల్లో నష్టపోవాల్సి వస్తుందనే భయం రైతులను వెంటాడుతోంది. నానాటికీ క్షీణిస్తున్న రొయ్యల ధరలు జిల్లా ఆర్థిక స్థితిగతులను ప్రభావితం చేస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని 35,908 మంది రైతులు 43,762.5 ఎకరాల్లో వనామీ రొయ్యల సాగు చేస్తున్నారు. ప్రధానంగా సముద్ర తీరంలోని మచిలీపట్నం, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, పెడన, బంటుమల్లి, కృత్తివెన్ను, కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ మండలాలతో పాటు గుడివాడ, హనుమాన్‌జంక్షన్ ప్రాంతాల్లో వీటి సాగు అత్యధికంగా ఉంది. ఏ మాత్రం ప్రతికూల వాతావరణ పరిస్థితులు తలెత్తినా, నీటిలో గాఢత హెచ్చుతగ్గులు వచ్చినా, చెరువు అడుగు భాగంలోని నేలలో కొద్దిపాటి మార్పులు వచ్చినా, ఇతర జీవులు చెరువులోకి ప్రవేశించినా పంట పూర్తిగా దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలోనే ఏడాదికి ఒక్క పంట సజావుగా చేతికి రావడం గగనమవుతోంది. ఒక్కో దఫా ఎకరానికి రూ.2లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పెట్టుబడి పెట్టి రైతులు నష్టపోతుంటారు. అయినా పట్టువదలకుండా సాగు చేసి ఏదో ఒక సందర్భంలో సజావుగా పంట దిగుబడి సాధిస్తారు.



ధర దిగాలు

ఇతర దేశాలకు ఎగుమతయ్యే ఆక్వా ఉత్పత్తుల్లో వనామీ అగ్రస్థానంలో ఉంటుంది. అమెరికా అధిక సుంకాల ప్రకటన వెలువడిన నాటి నుంచి వీటి ఎగుమతులు పూర్తిగా క్షీణించారు. ఆగస్టు మొదటి వారంలో రూ.550 ఉన్న 30 కౌంట్ రొయ్యల ధర నేడు రూ.380కి పడిపోయింది. 40 కౌంట్ రూ.450 నుంచి 340కి చేరింది. అయితే 50 నుంచి 100 కౌంట్ ధరలు మాత్రం రూ.10, రూ.20 హెచ్చుతగ్గులతో మార్కెట్‌లో కొనసాగుతున్నాయి. ధర అమాంతం పడిపోతుండటం, రోజురోజుకీ తగ్గుముఖం పడుతుండటం రైతులను తీవ్రంగా కలవరానికి గురి చేస్తోంది. రొయ్య కౌంట్‌కు రాకుండానే పట్టుబడి చేస్తున్న దృశ్యాలు తీరంలో కనిపిస్తున్నాయి. ఇదే ధరలు భవిష్యత్తులో కొనసాగితే ఎకరాకు రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తుందని సాగుదారులు అభిప్రాయపడుతున్నారు.

యథాతథంగానే సాగు ఖర్చులు

ధర తగ్గి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రైతులకు కాస్త మేలు చేద్దామనే ఆలోచన సీడ్, ఫీడ్ కంపెనీలకు, విద్యుత్ పంపిణీ సంస్థకు రాకపోవడం రైతులను మరింత కుంగదీస్తోంది. సీడ్ (మేత)లో వాడే సోయాబీన్, మొక్కజొన్న ధర పెరిగినపుడు మేత మిశ్రమం ధరను ఆమాంతం పెంచేసే కంపెనీలు, వాటి ధరలు తగ్గినపుడు మాత్రం ధరను తగ్గించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 25 కేజీల మేత మిశ్రమాన్ని రూ.2,200కు కొనుగోలు చేయాల్సి ఉండటం రైతులను భారీగా ఆర్థిక నష్టానికి దారితీస్తోంది. రాష్ట్రంలోని సీడ్ కంపెనీలన్నీ పలు రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు చెందినవే. రొయ్యల ధర పడినపుడు కనీసం సీడ్ ధరను తగ్గించాలనే ఆలోచన ప్రజాప్రతినిధులకు రాకపోవడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. ప్రస్తుతం ఒక్కో రొయ్య పిల్ల (సీడ్)ను 39 నుంచి 50 పైసలకు విక్రయిస్తూ నిలువునా దోచుకుంటున్నారని రైతులు మండిపడుతున్నారు. ఒక్కో ఎకరానికి 50 వేల నుంచి రూ.లక్ష వరకు రొయ్య పిల్లలను రైతులు వేస్తారు. వీటిలో కొన్ని రోజులకే దాదాపు 50 శాతం పిల్లలు చనిపోతాయి. ఈ నేపథ్యంలోనే ముందుగానే అధిక సంఖ్యలో పిల్లలను చెరువులో వదులుతారు. సీడ్ కోసమే ఎకరానికి రూ.40వేల నుంచి రూ.50వేల వరకు (రవాణా ఖర్చులు అదనం) రైతులు ఖర్చు చేయాల్సి వస్తోంది. రొయ్యల సాగులో విద్యుత్ ముఖ్య భూమిక పోషిస్తుంది. చెరువులకు యూనిట్‌ను రూ.1.50 కే సరఫరా చేయాలని రైతులు ఎప్పటి నుంచో ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోగా అధిక వసూళ్లతో ఆక్వా రైతులను ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. సాగు లేని చెరువుకు సైతం నెలకు రూ.5వేల నుంచి రూ.8వేల వరకు వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. సాగు జరిగేపుడు నెలకు రూ.30 నుంచి రూ.50 వేల వరకు విద్యుత్ చార్జీలు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రూ.10 లక్షల నష్టంతో బయటపడ్డా
సూరపనేని సురేష్, వెన్ననపూడి

పదెకరాల సాగు చేశా. ఎలాంటి ఇబ్బందులు లేకుండా రొయ్య పెరుగుతూ 40 కౌంట్‌కు వచ్చింది. 20 కౌంట్‌కు వచ్చే వరకు పెంచుదామనుకున్నాను. అయితే రేటు రోజురోజుకీ పడిపోతూ వస్తుంది. ఆ భయంతో వెంటనే పట్టుబడి చేశా. కేజీకి రూ.340 వచ్చింది. ఆ రేటు అస్సలు గిట్టుబాటు కాదు. పెట్టుబడి ఖర్చులైనా రాకపోగా ఎకరానికి రూ.లక్ష చొప్పున నష్టం వచ్చింది.

చాలా నష్టపోతున్నాం
నాదెళ్ల గౌతమ్, విజయవాడ



సముద్రతీర గ్రామాల్లో ఎకరానికి రూ.40 వేలు కౌలు చెల్లించి 15 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నా. 30, 40 కౌంట్ రొయ్యలు కేజీకి రూ.100 నుంచి రూ.150 వరకు తగ్గిపోయింది. ఇంకా తగ్గిపోయే ప్రమాదం ఉందని తెలుస్తోంది. ఎకరం సాగు చేసేందుకు రూ.4లక్షల నుంచి రూ.5 లక్షలు ఖర్చవుతోంది. సీడ్, ఫీడ్, విద్యుత్ ఖర్చులు పెరుగుతున్నాయి. రాబడి తగ్గిపోతుంది.

జగన్.. దమ్ముంటే సభకు రా..!

● మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



గొల్లపూడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో జరిగిన దుర్మార్గాలు బయటపడతాయనే భయంతోనే అసెంబ్లీకి రాకపోవడానికి కారణమని, జగన్‌కు దమ్ముంటే సభకు రావాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సవాల్ విసిరారు. గురువారం టీడీపీ విజయవాడ రూరల్ గొల్లపూడి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డికి దమ్ము ధైర్యం ఉంటే జగన్ సభకు రావాలని, ప్రెస్‌క్లబ్‌కు వచ్చి మీడియా ఎదుట మాట్లాడాలని సవాల్ విసిరారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో మెడికల్ కాలేజీల పేరిట వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టినట్టు చెబుతూనే, కేంద్రం ఇచ్చిన నిధుల్లో కేవలం రూ.470 కోట్లు మాత్రమే ఖర్చుచేసిన దాఖలాలున్నాయన్నారు. కేంద్రం రూ.975 కోట్లు విడుదల చేయగా, మిగతా నిధుల విషయమేంటో జగన్ సమాధానం చెప్పాలన్నారు. కన్వీనర్ కోటాలో 85 శాతం స్థానాలను 50 శాతానికి తగ్గించి, ఎన్నారై కోటాను 15 శాతం నుంచి 35 శాతానికి పెంచడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు అన్యాయం చేశారని విమర్శించారు. ఇటీవల జరిగిన ఒంటిమిట్ట ఉప ఎన్నికలో వైసీపీకి వచ్చిన ఘోర పరాజయం, పులివెందులలో డిపాజిట్ కోల్పోయిన పరిణామాలు జగన్‌ను అసెంబ్లీకి రానివ్వకుండా చేస్తున్నాయన్నారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి చంద్రబాబు కృషే కారణం

● ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



తిరువూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అప్పుల అగాధంలో ఉన్న రాష్ట్రం అభివృద్ధిలో, ఆర్థిక వృద్ధి రేటు సాధించడంలో పరుగులు పెట్టిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం రాత్రి ఆయన క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2025-2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారతదేశం 8.8 శాతం వృద్ధిరేటును రికార్డు చేస్తే, ఆంధ్రప్రదేశ్ 10.5 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసిందన్నారు. 2014-2019లో సైతం రాష్ట్ర వృద్ధిరేటును పెంచిన ఘనత కూడా చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని శ్రీలంక, ఇథియోపియా వంటి ఇతర చితికిపోయిన దేశాల పక్కన పెట్టాలని చూశారని, చంద్రబాబు మాత్రం అభివృద్ధి చెందిన సింగపూర్, అమెరికా, జపాన్ దేశాల పక్కన నిలపాలనే ధ్యేయంతో పనిచేస్తున్నట్టు వివరించారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వృద్ధి రేటు రాష్ట్ర ప్రగతికి చిహ్నమన్నారు. దీనిపై బహిరంగ చర్చకు వైసీపీ నేతలు ఎవరొచ్చినా కూటమి ప్రభుత్వం తరఫున తాను సిద్ధమన్నారు.

లోకేష్ కృషి హర్షణీయం

నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని తిరిగి మన దేశానికి తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ సాగించిన కృషి హర్షణీయమని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెలుగువారు నేపాల్‌లో ఇబ్బందులు పడుతున్న సమాచారంతో అనంతపురం పర్యటన రద్దుచేసుకొని సచివాలయానికి వెళ్లి అందరినీ సమన్వయం చేసుకుంటూ, వారిని మన దేశానికి తీసుకువచ్చిన లోకేశ్‌కు, తెలుగువారి తరుపున, నియోజకవర్గం ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లాలో 4 పీఏసీఎస్‌ల చైర్మన్లు, సభ్యులు


నంబూరి హరి కృష్ణ ప్రసాద్


షేక్ రెహ్మాతుల్లా

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో నాలుగు పీఏసీఎస్‌లకు ప్రభుత్వం చైర్మన్లను, సభ్యులను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరులపాడు మండలం జుజ్జూరు పీఏసీఎస్ చైర్మన్‌గా షేక్ రెహ్మాతుల్లా, సభ్యులుగా చెన్నుపాటి సౌరయ్య, షేక్ జాన్ సాహెబ్, కంచికచర్ల మండలం వేములపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ముక్కపాటి నరసింహారావు, సభ్యులుగా పా లపర్తి దిబ్బయ్య, జినెపల్లి చిన్న వెంకట కొండ, గంపలగూడెం మండలం కొణిజర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా నంబూరి హరికృష్ణ ప్ర సాద్, సభ్యులుగా ఇలవరపు శ్రీనివాస్, ఇలవరపు నాగేంద్రమ్మ, తిరువూరు మండలం మల్లెల పీఏసీఎస్ చైర్మన్‌గా గాడిపర్తి హనుమంతరావు, సభ్యులుగా ఆరేపల్లి నవీన్, కంటే శివ చరణ్ నియమితులయ్యారు.

నెలలో అగ్నిమాపక పరికరాల వివరాలు తెలపాలి

భవన యజమానులకు అగ్నిమాపక సేవల శాఖ సూచన

వన్‌టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భవన యజమానులు నెలలోపు వారి భవనాల్లో అగ్నిమాపక పరికరాల వివరాలను తెలపాలని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ సంచాలకుడు రమణ పేర్కొన్నారు. ఏదైనా సమాచారం కావాలంటే 9441236448 నంబరులో కానీ, కనెక్ట్ డీజీ ఫైర్ జీమెయిల్‌లో కానీ సంప్రదించాలని గురువారం తెలిపారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు మేరకు 2021-22లో అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిరభ్యంతర ధ్రువపత్రాలను సవరిస్తూ జారీ చేసిన ప్రభుత్వ గెజిట్ మేరకు అగ్నిమాపక చట్టం 1999కి అనుగుణంగా హై రైజెడ్ భవనాల్లో అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయటానికి సమయం ఇచ్చినట్టు వెల్లడించారు. భవన యజమానులు 30 రోజుల్లో వివరాలను అందించాలని, అదనపు సమయం కావాలంటే విజ్ఞప్తి చేసుకోవచ్చన్నారు. చట్టానికి అనుగుణంగా ఉంటే రివైజ్డ్ నిరభ్యంతర (ఎన్‌వోసీ) జారీ చేస్తామన్నారు.

విజయవాడ ఉత్సవ్ విజయవంతానికి ఏం చేద్దాం!

● నగర ప్రముఖులు, ఎన్‌జీవోలు, నేతలతో సమాలోచనలు

● పవిత్రసంగమం వద్ద కార్యక్రమాల నిర్వహణపై పరిశీలన

ఆంధ్రజ్యోతి, విజయవాడ: దసరా సందర్భంగా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ - 2025ను దిగ్విజయం చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై నిర్వాహక కమిటీ సమాలోచనలు చేస్తోంది. పదకొండు రోజుల పాటు నగర వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలంటే అందరి భాగస్వామ్యం అవసరం. ఈ దిశగా నిర్వాహక కమిటీ నగరంలోని ప్రముఖులు, వివిధ రంగాల ప్రతినిధులు, ఎన్‌జీవో సంస్థల సహకారాన్ని కోరుతోంది. ఆర్థిక అవసరాలతో పాటు అన్ని రకాలుగా చేయి అందించే వారికోసం ప్రయత్నాలు చేస్తోంది.

దసరా ఉత్సవాలకు భారీ సంఖ్యలో వచ్చే వారిని ఈవెంట్లకు తీసుకువెళ్లగలిగేలా చేయటంలో ఎలాంటి విధానాలు అవలంభించాలి? విజయవాడ ఉత్సవ్ గురించి మరింత లోతుగా ప్రజల్లోకి ఎలా తీసుకు వెళ్లాలన్న అంశాలపై నిర్వాహక కమిటీ మల్లగుల్లాలు పడుతోంది. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా ఇప్పటికే ప్రధానంగా నిర్వహించే కార్యక్రమాల వేదికల వివరాలను ప్రకటించడం జరుగుతోంది. దీంతో పాటు పవిత్ర సంగమాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు సమాచారం. అక్కడ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించగలమన్న ఆలోచనలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో వీలయ్యేలా లేదు. ఎందుకంటే పవిత్ర సంగమానికి వెళ్లే ప్రధాన రోడ్డు కుంగిపోయింది. కాలువ పక్కనే నిర్మించటం వల్ల భారీగా కుంగుదల సంభవించింది. దీన్ని ఇప్పటికిప్పుడు బాగు చేయాలంటే ఖర్చు ఎక్కువ. ప్రస్తుతం ఉన్న బీటీని తొలగించి వెట్‌మిక్స్, హాట్‌మిక్స్‌తో పటిష్ఠపరిచి రోడ్డు వేస్తే తప్ప పవిత్ర సంగమానికి వాహనాల్లో చేరుకునే పరిస్థితి లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే ఈ దసరా నాటికి పవిత్ర సంగమం ముఖద్వారాన్ని అభివృద్ధి చేయటం కష్టం. మరి నిర్వాహకులు ఏం చేస్తారన్నది వేచి చూడాల్సిందే!


కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆషా ప్రతినిధులు

ప్రస్తుత స్టార్ హోటళ్లకు పరిశ్రమ హోదా ఇవ్వండి

● కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు విజ్ఞప్తి

వన్‌టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కొనసాగుతున్న స్టార్ హోటళ్లకు కూడా పరిశ్రమ హోదా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (ఆషా) గురువారం కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, సహాయ మంత్రి సురేష్ గోపీకి విజ్ఞప్తి చేసింది. న్యూఢిల్లీలో మంత్రులను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి, జనరల్ సెక్రటరీ చిట్టూరి ఎస్ మూర్తి ఉన్నారు. న్యూఢిల్లీలో జరిగిన 2025-26 బడ్జెట్‌కు సంబంధించి జాతీయ స్టేక్ హోల్డర్ కన్సల్టేషన్ సందర్భంగా మంత్రులకు ఈ విజ్ఞప్తి చేశారు. కొత్త ప్రాజెక్టులకు మాత్రమే పరిశ్రమ హోదా ఇవ్వటాన్ని పరిమితం చేయకుండా ఇప్పటికే కొనసాగుతున్న స్టార్ హోటళ్ల కూడా పరిశ్రమ హోదా ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో చాలెంజ్ మూడ్‌లో 50 ప్రపంచస్థాయి పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ మెరుగుదలకు చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏపీ టూరిజం సీఈవో కటా అమ్రపాలి మాట్లాడుతూ లక్ష్యసాధనలో కేంద్ర ప్రభుత్వంతో తమ భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. హోటళ్ల అభివృద్ధికి సంబంధించి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ఏకగవాక్ష క్లియరెన్స్‌లు, తదితర అనేక అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.

జీఐఎస్ అండ్ ఆర్‌ఎస్‌ఏ టెక్నాలజీ వినియోగంలో
సీఆర్‌డీఏకు ప్రతిష్టాత్మక అవార్డు

కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీకు జీఐఎస్-జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం, ఆర్‌ఎస్‌ఏ-రిమోట్ సెన్సింగ్ అసిస్టెంట్ టెక్నాలజీల వినియోగంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు ప్రతిష్టాత్మకమైన బెస్ట్ యూజర్ ఆర్గనైజేషన్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో సెప్టెంబరు 10న పార్క్ హోటల్‌లో జరిగిన ఇస్రీ ఇండియా సంస్థ వార్షిక యూజర్ కాన్ఫరెన్సులో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అజేంద్ర కుమార్ ఈ అవార్డును ఏపీసీఆర్‌డీఏ ప్లానింగ్ విభాగ డైరెక్టర్ టీ సురేష్ కుమార్, జీఐఎస్, ఆర్‌ఎస్‌ఏ విభాగ సిబ్బందికి అందజేశారు. ఏపీసీఆర్‌డీఏ పట్టణ ప్రణాళిక, అమరావతి నగర నిర్మాణం, అభివృద్ధిలో జియోస్పేషియల్ టెక్నాలజీని సృజనాత్మకతతో సమర్థవంతంగా వినియోగిస్తున్నందున ఈ అవార్డు అందజేశారు. ఇది డేటా ఆధారిత సేవలు, పట్టణాభివృద్ధికి అత్యాధునిక జీఐఎస్, ఆర్‌ఎస్‌ఏ టెక్నాలజీని వినియోగించడంలో సీఆర్‌డీఏ నిబద్ధతను ప్రతిబింబిస్తోంది.



వార్షిక యూజర్ కాన్ఫరెన్సులో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140 , 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

ఎరువుల రికార్డుల తనిఖీ

పెదపారుపూడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యలమర్రు పీఏసీఎస్‌లో యూరియా నిల్వలపై వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలపై గుడివాడ డివిజనల్ సహకార అధికారి ఆదేశాల మేరకు సబ్ డివిజనల్ అధికారి జె.నాగభూషణం (గన్నవరం) గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అన్ని సక్రమంగా ఉన్నాయన్నారు. రైతులందరికీ యూరియా సక్రమంగా అందేవిధంగా తగు సూచనలు చేశారు.



రికార్డులను పరిశీలిస్తున్న నాగభూషణం

శిథిల భవనాలతో భయం .. భయం

- ప్రభుత్వ కార్యాలయ భవనాల దుస్థితి దారుణం
- పట్టణంలో 10కిపైగా పాత భవనాలు
- పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - గుడివాడ) : గుడివాడలో ఎప్పుడో బ్రిటిషు కాలంలో కట్టిన భవనాల్లోనే ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆర్‌డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో పైకప్పు నుంచి పెంకులు ఊడి పడి ఉద్యోగులు గాయపడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఆర్‌డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలకు వర్షపు నీరు కారకుండా తారు షీట్‌లను పైకప్పుకు ఏర్పాటు చేసుకున్నారు. గృహ నిర్మాణ శాఖ ఈఈ కార్యాలయ భవన పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ట్రెజరీ, సీసీఎస్ కార్యాలయాల పైకప్పుకు తార్పాలిన్ పట్టాను కప్పుకున్నారు. సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణం పెంకులు ఊడి భయానకంగా మారడంతో కోర్టును తరలించారు. పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ కార్యాలయం పెంకులు ఊడి పడుతుండటంతో పక్కనున్న ఆర్‌డీవో కార్యాలయంలోకి మార్చారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. వర్షం కురిస్తే రికార్డులు తడిసిపోతున్నాయి. దీనికోసం కార్యాలయ పైభాగాన తార్పాలిన్ పట్టాలను కప్పారు. ఇటీవల చిన్నపాటి మరమ్మతులు చేపట్టారు. సబ్ జైలును పునఃనిర్మాణం పేరుతో పూర్తిగా మూసివేశారు.

గుడివాడలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాల్లో కొన్ని మరమ్మతులు కోరుతుండగా, మరికొన్ని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. భవనాల స్థితిని బట్టి కూల్చివేయాలా....మరమ్మతులు చేస్తే సరిపోతుందా... అనే విషయాన్ని స్ట్రక్చరల్ ఇంజినీర్లు పరిశీలించి నిర్ధారించాలి. దాని ఆదారంగా పూర్తిగా పాడైన భవనాలను కూల్చివేయాలి. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యేక దృష్టిసారించి శిథిల భవనాలపై ఒక నిర్ణయం తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.



120ఏళ్ల నాటి పురాతన ఆర్‌డీవో కార్యాలయ భవనం



ఎరువుల గోడౌన్‌గా వినియోగంలో ఉన్న పాత భవనం

భవనాల స్థితిగతులపై సర్వే చేస్తాం

పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో గతంలో 10 భవనాలను తొలగించాము. పట్టణంలో భవనాల స్థితి గతులపై పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తాం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తక్షణ చర్యలు తీసుకుంటాం.

వి.యేసుబాబు , అసిస్టెంట్ టౌన్ ప్లానర్



విజేతలకు బహుమతి ప్రధానం చేస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ

సృజనాత్మకతను పెంపొందించేందుకే కళా ఉత్సవ్

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థుల్లో కళలను, సృజనాత్మకతను పెంపొందించడానికి కళా ఉత్సవ్ వంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అంగలూరు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం అంగలూరు ప్రభుత్వ డైట్ కళాశాలలో కళాఉత్సవ్ 2025 ను నిర్వహించారు. ఉత్సవాన్ని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, సోషల్‌వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల నుంచి 9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గాత్ర సంగీతం, నృత్యనాటకం, వాయిద్య సంగీతం, నాటిక, సంప్రదాయ కథలు, దృశ్యకళల ప్రదర్శనలను విద్యార్థులు ఎంతో అద్భుతంగా ప్రదర్శించారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు వెళతారని లక్ష్మీనారాయణ తెలిపారు.

యూటీఎఫ్ గుడ్లవల్లేరు అధ్యక్షుడిగా రామకృష్ణ

గుడ్లవల్లేరు : యూటీఎఫ్ గుడ్లవల్లేరు అధ్యక్షుడిగా డీవీఎం రామకృష్ణ, కార్యదర్శిగా కె.వెంకట్రావులు ఎంపికయ్యారు. గుడ్లవల్లేరు మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం మండల కౌన్సిల్ సమావేశంలో గురువారం ఎంపిక చేశారు. ఈ ఎంపికకు ఎన్నికల అధికారిగా ఎన్.ప్రభాకర్ వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, కృష్ణా జిల్లా శాఖ అధ్యక్షులు షౌకత్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి బి.కనకారావు, గౌరవాధ్యక్షుడు లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రమేష్‌బాబు

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

గుడివాడ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బిళ్లపాడు గ్రామ ప్రముఖులు, లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి నాయకులు ఉపదృష్ట రాంబాబు జన్మదినం సందర్భంగా గురువారం గంగాధరపురం ఉన్నత పాఠశాల బాలబాలికలు 12 మందికి ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ప్రగతి జిల్లా క్యాబినెట్ సెక్రటరీ తుమ్మల రమేష్‌బాబు చేతులమీదుగా సైకిళ్లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, అధ్యక్షుడు మాదాల సురేష్, యువీఆర్‌కే ప్రసాద్, జేసీ ఉప్పల సతీష్, కార్యదర్శి పామర్తి కేశవరావు, ఉరిటి రామారావు, ఉపదృష్ట రాంబాబు, సనకా సుబ్బారావు, కెవి.రమణ, ఎం.వీరశేఖర్, కెవి.చైతన్య కుమార్, మల్లంపల్లి వెంకట్రావు, రామదేని వేణుబాబు, నల్లూరి శేషగిరిరావు, ఎం.సిహెచ్.నారాయణరెడ్డి, రావి నవీన్, అట్లూరి శశి, పాల్గొన్నారు.

వర్గీకరణలేని ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలి

- దండు వీరయ్య మాదిగ

గుడివాడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలు కానీ ఉద్యోగ నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిలుపుదల చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తిగా అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న డీఎస్సీ, కానిస్టేబుల్ పోస్టులు, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీలో ఎస్సీలకు సంబంధించి నియామకాలను నిలుపుదల చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ 12వ వార్షికోత్సవం సందర్భంగా 344 పేరిగ మాదిగల అభివృద్ధికి ఉపయోగపడే విధంగా పలు సంస్కరణలు తీసుకురానున్నామన్నారు. సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ చేసినప్పటికి తెలుగు రాష్ట్రాల్లో అమలు కావడం లేదన్నారు. ఏ,బీ,సీ,డీ వర్గీకరణ లేని ఉద్యోగ నియామకాలను వెంటనే నిలుపుదల చేసి, వర్గీకరణ అనంతరం నియామకాలను చేపట్టాలని దండు వీరయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ పచ్చిగళ్ల దేవానందరావు, జిల్లా ఇన్‌చార్జ్ కొదమల గంగాధరరావు, నాయకులు గంథం సైమన్‌బాబు, జుజ్జవరపు ప్రశాంతి, చేరగుడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

చేవేండ్రలో భారీ చోరీ

పెడన, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేవేండ్ర గ్రామంలోని ఒక ఇంట్లో దొంగలు పడి 25 కాసుల బంగారం, కిలో వెండి, రూ. 2లక్షల నగదు అపహరించుకుపోయారు. చేవేండ్ర గ్రామానికి చెందిన అంకెం కమలాకరరావు బుధవారం మధ్యాహ్నం భార్యతో కలసి మచిలీపట్నం వెళ్లి తిరిగి రాత్రి 10.30 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. వచ్చే సరికి ఇంటి తలుపులు, బీరువా తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. చోరీ జరిగిందని గ్రహించిన కమలాకరరావు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. డీఎస్పీ సిహెచ్. రాజా, సిఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై సత్యనారాయణలు కమలాకరరావు ఇంటికి వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

చల్లపల్లి : లక్ష్మీపురంలోని సాయిదుర్గ మెన్యూర్స్ దుకాణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విజయవాడ ఏడీఏ వి.కిరణ్, చల్లపల్లి ఏవో కె.మురళీకృష్ణ గురువారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఈ-పోస్‌లో, రిజిస్టర్‌లో నమోదు చేయకుండా విక్రయాలు చేపట్టడం, సరైన అనుమతులు లేకుండా ఎరువులను తీసుకువచ్చి విక్రయించటాన్ని అధికారులు గుర్తించారు. ఎరువుల దుకాణంలో రూ.1,57,080 విలువైన ఎరువుల విక్రయాలను నిలుపుదల చేసి యజమానికి షోకాజ్ నోటీసు జారీచేశారు.

నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్‌కి సర్పంచ్ అర్జునరావు

నాగాయలంక : న్యూ ఢిల్లీలో ఈనెల 15నజరిగే సర్పంచ్ సంవాద్ నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్‌కు పెదకమ్మవారిపాలెం సర్పంచ్ తలశిల అర్జునరావు ఎంపికయ్యారు. ఈ మేరకు అయనకు ఆహ్వానం అందింది. భారత ప్రభుత్వం తనకు ఆహ్వానం పంపినందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశం ద్వారా ఆరోగ్యకరమైన గ్రామాల లక్ష్యాల సాధనకుమార్గదర్శకత్వం లభించనుంది.

ఏపీటీఎఫ్ పామర్రు మండల కార్యవర్గం ఏకగ్రీవం

పామర్రు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ పామర్రు మండల ఉపాధ్యాయ సంఘ నూతన అధ్యక్షుడిగా దాసరి ప్రకాష్, ప్రధానకార్యదర్శిగా జె.బాలాజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆసంఘ ఎన్నికల నిర్వాహణాధికారిగా వ్యవహరించిన జిల్లా ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు ప్రకటించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన ఆసంఘ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడిగా జితాతారావు, ఎంవీవీ నాంచారయ్య, కార్యదర్శులుగా బి.చంద్రశేఖర్, కె.శ్రీనివాసరావు, బి.విజయలక్ష్మితో పాటుగా కార్యవర్గ సభ్యులు ఎన్నికైనట్లు వెల్లడించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఆసంఘ ఉపాధ్యక్షుడు వి.రామారావు, నూతన కార్యవర్గాన్ని అభినందించి, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధంకావాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఎన్నికల అధికారి శ్రీనివాసరావు

వరిలో పొటాష్ ధాతు లోపాన్ని నివారించాలి

- డాక్టర్ డి. సుధారాణి

తోట్లవల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరిలో పోటాష్ దాతు లోపంతో ముదురు ఆకులు పసుపు రంగులోకి మారి మొక్క చనిపోయే అవకాశం ఉందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డి. సుధారాణి రైతులకు వివరించారు. మండలంలోని గరికపర్రు, యాకమూరు, భద్రిరాజుపాలెం గ్రామాల్లో గురువారం కేవీకే శాస్త్రవేత్తలు పర్యటించి వరి, చెరకు తోటలను పరిశీలించారు. వరిలో పోటాష్ ధాతు లోప నివారణకు ఎకరానికి 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువుని తప్పకుండా వేయాలని సూచించారు. చెరకులో తెల్లదోమ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 50 మి.లీ లేదా అసిటామిప్రిడ్ 50 గ్రా ఎకరానికి పిచికారి చేయాలని రైతులకు తెలియజేశారు. చెరకులో తీగజాతి కలుపు ఉంటే మెట్‌సల్ఫ్యూరాన్ మిథైల్ , క్లోరీమ్యూరాన్ ఇథైల్ మందుని ఎకరానికి 8 గ్రామ చొప్పున పిచికారి చేయాలని సుధారిణి తెలిపారు. కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, సస్యపోషణ శాస్త్రవేత్త వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.



వరిపైరుని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు సుధారాణి, రేవతి, వెంకటలక్ష్మి

అరిసేపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా వన్నెంరెడ్డి శ్రీనివాస రవికుమార్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అరిసేపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా వన్నెంరెడ్డి శ్రీనివాస రవికుమార్‌ను, సభ్యులుగా డి. వెంకట సూర్యరంగమోహనరాజు, గోవాడ వెంకటేశ్వరరావులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పీఏసీఎస్ త్రీమెన్ కమిటీలపై ప్రభుత్వం జారీ చేసిన 795 ఉత్తర్వుల మేరకు వీరిని నియమించారు.



ఆర్థిక సాయం అందిస్తున్న రామకోటేశ్వరరావు

ఆర్థిక సాయం

పామర్రు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): అనారోగ్యకారణంతో మృతిచెందిన పీఏసీఎస్ సభ్యులు ఆరేపల్లి మధుసూదనరావు (68) కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం పెదమద్దాలి ప్రాథమిక వ్యవసాయ పరిపతి సంఘం అధ్యక్షుడు దేవరపల్లి రామకోటేశ్వరరావు గురువారం కేడీసీసీ బ్యాంకు తరపున రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పామర్రు నీటిసంఘం చైర్మన్ కోసరాజు వేంకటేశ్వరరావు, మాజీ డీసీ చైర్మన్ మండవ కృష్ణారావు, పీఏసీఎస్ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనే విజయానికి సోపానం

గుడివాడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : మూస పద్ధతిలో కాకుండా సృజన్మాతకంగా ఆలోచనచేయడం వల్ల విషయ అవగాహన పెంపొందించుకోవచ్చునని ఏజే కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్ఎన్ శాస్త్రి పేర్కొన్నారు. గురువారం స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో సృజన్మాతక ఆలోచన ధోరణులు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఆలోచింపజేస్తూ పోటీ పరీక్షలకు వివిధ టెక్నిక్‌లను ఉపయోగించి విజయాలను సాధించవచ్చునన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, అధ్యాపకులు సీహెచ్ ప్రకాష్, డాక్టర్ డీఎన్ ప్రత్యూష, వి.సువర్ణలక్ష్మీ, ఎ.సునీత, ఎన్.నాగలక్ష్మీ, ఎ.సుకీల, వి.గోపి తదితరులు పాల్గొన్నారు.



భాషా వైకుంఠపాళి ఆడుతున్న విద్యార్థులు



బెయిలీ బ్రిడ్జికి మరమ్మతులు చేస్తున్న కార్మికులు

బెయిలీ బ్రిడ్జిపై వాహనాలు రాకుండా చర్యలు చేపట్టాలి

కూచిపూడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిన్నముత్తేవిలోని ఐనంపూడి డ్రెయిన్‌పై బెయిలీ బ్రిడ్జి మరమ్మతులు గత మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. నాణ్యమైన రేకులను ప్లాట్ పామ్‌కు వినియోగించాలని, అలాగే భారీ వాహనాలు, ఇసుక టిప్పర్ల రాకపోకలు వంతెనపై నిషేధం విధించాలని సీపీఎం మొవ్వ మండల కార్యదిర్శ శీలం నారాయణరావు అధికారులను కోరారు. గతంలోనూ ఈ వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగించటం వల్ల త్వరితగతిన వంతెన పాడైపోయినట్లు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా మచిలీపట్నం నుంచి నిడుమోలు, ఆవిరిపూడి, మంత్రిపాలెం, చినముత్తేవి గ్రామాల మీదుగా మొవ్వ, కూచిపూడి వరకు నడిచే ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని కోరారు. కళాశాలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు బస్సుల రాకపోకలు లేని కారణంగా ఆటోలను, ఇతర వాహనాలను ఆశ్రయించి పలు ఇబ్బందులు పడుతున్నట్లు నారాయణరావు పేర్కొంటూ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డీఎల్‌పీవో సంపత్‌కుమారి



వర్మీకంపోస్టు తొట్టెలను పరిశీలిస్తున్న సంపత్‌కుమారి

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :వర్షాలు, తీవ్ర ఎండలు ఒకటి విడిచి ఒకటి రావడంతో వాతావరణంలో వస్తున్న తీవ్రమైన మార్పుల కారణంగా గ్రామాల్లో ప్రజల్లో జ్వరాలు పెరుగుతున్నాయని గుడివాడ డివిజనల్ పంచాయతీ అధికారి సంపత్‌కుమారి సూచించారు. డోకిపర్రులోని రక్షిత తాగునీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో క్లోరినేషన్ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ అధికారులు గ్రామాల్లో క్లోరినేషన్, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంపై శ్రద్ధ వహిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని వర్మీకపోస్టు టొట్టెలను తిలకించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో అంజనాదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మీ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మి

గుడివాడ : మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని , నార్కోటిక్స్ డ్రగ్స్‌కు సంబంధించిన వాటి లభ్యత గురించి సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని గుడివాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.జయలక్ష్మీ అన్నారు. గురువారం స్థానిక ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు సంబంధిత మందుల వల్ల కలిగే దుష్పలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ యలమంచిలి రెడ్డియ్య చౌదరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వే గేట్‌మెన్‌పై దాడి .. నిందితులకు నెలరోజుల జైలుశిక్ష

గుడివాడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : గుడివాడ రైల్వేస్టేషన్ పరిధిలో గతేడాది నవంబరు 4వ తేదీన దోసపాడులోని రైల్వే గేట్‌మెన్‌పై దాడి చేసి దుర్భాషలాడిన కేసులో ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి రూ.9వేలు జరిమానా కట్టలేని పక్షంలో నెలరోజుల జైలుశిక్ష విధించినట్లు రైల్వే సబ్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ షరీఫ్ తెలిపారు. విజయవాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి దుర్గారావు త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయగా, విజయవాడ రైల్వే కోర్టు న్యాయమూర్తి వీరికి శిక్ష విధించినట్టు తెలిపారు. విజయవాడ సీఐ దుర్గారావు, రైల్వే సబ్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ షరీఫ్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలి

- కొమ్మనబోయిన లక్ష్మీనాథ్



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు

గుడివాడ రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని ఐక్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కన్వీనర్ కొమ్మనబోయిన లక్ష్మీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గుడివాడ డివిజన్‌లో 2003 డీఎస్సీ ఉపాధ్యాయ నాయకులు నలబ్యాడ్జీలు ధరించి మహాధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కిరణ్‌కు మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు పాత పెన్షన్ విధానానికి అన్ని యూనియన్లు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమానంగా పాటించాలని కోరారు. 2003 సంవత్సరంలో ఐఏఎస్ అధికారులకు పాత పెన్షన్ అవలంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌సీ జిల్లా కన్వీనర్ జయరాజు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ.వి.వరలక్ష్మీ, ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి బి.చంద్రశేఖర్, ఎస్‌టీయూ మాజీ జిల్లా కార్యదర్శి ఏవి.బేతాశరావు, గుడివాడ యూనియన్ నాయకులు బెనర్జీ, కృష్ణకాంత్, రమేష్, సుజాత, పాల్గొన్నారు.

కూచిపూడి: 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ డీఎస్సీ 2003 ఫోరం ఆధ్వర్యంలో మొవ్వ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం అర్హత కలిగిన సుమారు 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పోలీసులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ మొవ్వ తహసీల్దార్ మస్తాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తమ్ము నాగరాజు, జయలక్ష్మీ, నాగేశ్వరరావు, సుజాత, పాగోలు రమేష్‌బాబు, రజని, రవీంద్రబాబు, ఉషారాణి, వీర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మొవ్వ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

చేవేంద్రలో భారీ చోరీ

పెడన, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేవేంద్ర గ్రామంలోని ఒక ఇంట్లో దొంగలు పడి 25 కాసుల బంగారం, కిలో వెండి, రూ. 2లక్షల నగదు అపహరించుకుపోయారు. చేవేంద్ర గ్రామానికి చెందిన అంకెం కమలాకరరావు బుధవారం మధ్యాహ్నం భార్యతో కలసి మచిలీపట్నం వెళ్లి తిరిగి రాత్రి 10.30 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. వచ్చేసరికి ఇంటి తలుపులు, బీరువా తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. చోరీ జరిగిందని గ్రహించిన కమలాకరరావు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. డీఎస్పీ సిహెచ్. రాజా, సిఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై సత్యనారాయణలు కమలాకరరావు ఇంటికి వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు.



రంగనాయక స్వామి ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటేశ్వరరావు, సభ్యులతో టీడీపీ సీనియర్ నేత గోపీచంద్, మోటమర్రి బాబాప్రసాద్

సనాతన హైందవ ధర్మాన్ని పరిరక్షించాలి

● రంగనాయకస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సనాతన హైందవ ధర్మాన్ని పరిరక్షించేందుకు ధర్మకర్తల మండలి కృషి చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ పిలుపు నిచ్చారు. రాబర్టుసన్‌పేట రంగనాయకస్వామి దేవాలయంలో ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం గురువారం జరిగింది. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నల్లారి వెంకటేశ్వరరావు, సభ్యులుగా నండూరి రజని, చినముత్తేవి కుమారి, నెరుసు బాలరాజు, రామాజ్యోతి, అన్నం స్వరాజ్యలక్ష్మి, నరహరశెట్టి వెంకట సాంబశివరావు, కుంబా నాగమణి, గాదె శ్రీనివాసరావు, గరికపూడి నాగబాబు, ముత్తేవి శ్రీనివాసాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంసత్యప్రసాద్‌బాబు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ధర్మకర్తల మండలితో ప్రమాణస్వీకారం చేయించారు. డీసీఎంఎస్ అధ్యక్షుడు బండి రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్లు అన్నం ఆనంద్, మరకాని సమతాకీర్తి, టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, ప్రముఖ న్యాయవాది సోడిశెట్టి బాలాజీ, టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, అక్కుమహంతి రాజా, పివి ఫణికుమార్, గడ్డం రాజు, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యామ్‌సుదర్శనరావు

ఫణికుమార్‌కు బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని మచిలీపట్నం బ్రాహ్మణ సంఘ నాయకులు పి.వి.ఫణికుమార్ ఇవ్వాలని బ్రాహ్మణ సంఘ రాష్ట్ర నాయకుడు చిత్రపు శ్యామ్ సుదర్శనరావు డిమాండ్ చేశారు. శిడింబి అగ్రహారంలో గురువారం శ్యామ్ సుదర్శనరావు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధిష్ఠానం పునరాలోచించి పదవిని తిరస్కరించిన దింట్యాల వరప్రసాద్ స్థానంలో పి.వి. ఫణికుమార్‌కు ఇవ్వాలని కోరారు. ప్రముఖ న్యాయవాది జీవీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెడన, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వివిధ ప్రాంతాలలో గురువారం అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ఒక ఇంట్లో నాలుగున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్ కుమార్ ఆదేశాల మేరకు జరిగిన తనిఖీలలో పీడీఎస్ డీటీ నాగమల్లేశ్వరరావు, ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.



అసంపూర్తిగా రైలుపేట పాఠశాల భవన నిర్మాణం, నేలపైనే కూర్చొని చదువుకుంటున్న విద్యార్థులు

అసంపూర్తిగా తరగతి గదులు

● వైసీపీ పాలనలో నాడు-నేడు పనుల నిర్లక్ష్యం ● నేటికీ నిర్మాణం పూర్తికాక విద్యార్థుల వెతలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ పాలనలో చేపట్టిన నాడు-నేడు పథకం పనులు అసంపూర్తిగా మిగిలాయి.

కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో భవనాల పనులు పూర్తి చేయకుండానే మధ్యలో వదిలేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేసింది. మోడల్ పాఠశాలలు, అప్‌గ్రేడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. విద్యార్థుల అవసరాలకు తగిన తరగతి గదులు లేవు. విద్యార్థుల తల్లిదండ్రులు పేరెంట్ టీచర్స్ కమిటీ సమావేశాల్లో సమస్యలను ప్రధానోపాధ్యాయులతో చెబుతున్నారు. బందరు మండలం చిట్టిపాలెంలో జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు సరిపడ తరగదులు లేవు. రైలుపేట మునిసిపల్ హైస్కూలును ఇటీవల అప్‌గ్రేడు చేశారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు. పాఠశాల విద్యార్థులు అసంపూర్తి భవనంలోనే నేలపై కూర్చుని పాఠాలు చదువుకుంటున్నారు. జిల్లాలో దా దాపు 40 పాఠశాలలకు తరగతి గదుల సమస్య ఉంది. సమస్యను కలెక్టరు బాలాజీకి సమగ్ర శిక్ష అధికారులు తెలియజేశారు. సమగ్ర శిక్ష ఇంజనీర్లు అసంపూర్తి భవనాలకు ఎన్ని నిధులు అవసరమో సర్వే చేస్తున్నారు. నిధులు సేకరించి ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ యోచిస్తున్నారు.

అరిసేపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా శ్రీనివాస రవికుమార్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం అరిసేపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా వన్నెంరెడ్డి శ్రీనివాస రవికుమార్‌ను, సభ్యులుగా డి. వెంకట సూర్యరంగమోహనరాజు, గోవాడ వెంకటేశ్వరరావులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పిఏసీఎస్ త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన నెం.795 ఉత్తర్వుల మేరకు వీరి నియామకం జరిగింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్లకు మరమ్మతు నేపథ్యంలో బందరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. గోవిందరావు తెలిపారు. చిన్నాపురం, పొట్లపాలెం, గోపువానిపాలెం, పోతిరెడ్డిపాలెం, కొత్తపూడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.



డ్రెయిన్లలో కదలని మురుగు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డ్రెయిన్లలో మురుగు కదలక దోమలు పెరిగిపోతున్నాయి. ఈడేపల్లి, రుస్తుంబాద, లక్ష్మీటాకీసు సెంటర్, మాచవరం ప్రాంతాల్లో డ్రెయిన్లలో మురుగునీరు కదలక దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. నగర పాలక సంస్థ అధికారులు స్పందించి మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు చెరువులకు వేలంపాట 17న

పెడన, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్తచెరువు, తామరచెరువు, మల్లిచెరువులలో మూడు సంవత్సరాల పాటు చేపలు పెంచి పట్టుకునే హక్కులకు ఈనెల 17న ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి తెలిపారు. వివరాల కోసం మునిసిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కొల్లూరి చిన్నాకు రాజేంద్రప్రసాద్ సేవ పురస్కారం

పెడన, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కొల్లూరి చిన్నా భారత ప్రథమ రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జాతీయ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. కరోనా సమయంలో విశిష్ట సేవలందించినందుకు విశాఖపట్నానికి చెందిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖ రత్న కళాపరిషత్ చిన్నాను ఈ పురస్కారానికి ఎంపికచేశాయి. ఈనెల 14న విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో చిన్నా గౌరవ పురస్కారం అందుకుంటారు.



రణభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలి

చల్లపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక, ఈనెల 25వ తేదీన విజయవాడలో జరిగే రణభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల కనకారావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. చల్లపల్లి యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం సాయంత్రం జరిగిన ప్రాంతీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యారంగంలో సమస్యలు పరిష్కరించకపోగా ప్రభుత్వమే విద్యాసంస్థలను బలహీనపరిచిందన్నారు. విజయవాడలో వేలాదిమందితో బహిరంగసభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి అల్టిమేటం ఇవ్వటం ద్వారా రణభేరి మోగించేందుకు ఉపాధ్యాయులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రణభేరి కర పత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి టి.నాగేశ్వరరావు చల్లపల్లి, ఘంటసాల, మొవ్వ మండల శాఖల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

చల్లపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురంలోని సాయిదుర్గ మెన్యూర్స్ దుకాణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విజయవాడ ఏడీఏ వి.కిరణ్, చల్లపల్లి ఏవో కె.మురళీకృష్ణ గురువారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఈ-పోస్‌లో, రిజిస్టర్‌లో నమోదు చేయకుండా విక్రయాలు చేపట్టడం, సరైన అనుమతులు లేకుండా ఎరువులను తీసుకువచ్చి విక్రయించటాన్ని అధికారులు గుర్తించారు. ఎరువుల దుకాణంలో రూ.1,57,080 విలువైన ఎరువుల విక్రయాలను నిలుపుదల చేసి యజమానికి షోకాజ్ నోటీసు జారీచేశారు.



ఎన్‌సీసీ క్యాడెట్లు దేశ సేవ చేయాలి

గూడూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేశ సేవకు ఎన్‌సీసీ క్యాడెట్లు ముందుండాలని లెఫ్టినెంట్ కల్నల్ ఆర్. కన్నన్ అన్నారు. గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లతో ఆయన సమావేశం అయ్యారు. సబార్డినేట్ భగవాన్, హవల్దార్ టి. ధర్మారావు, ప్రధానోపాధ్యాయురాలు గొరిపర్తి విజయకుమారి, పీడీలు మత్తి అరుణ, చిలుకోటి రాజేష్, ఎన్‌సిసి టీం విద్యార్థులు, ఇన్‌చార్జి ఉపాధ్యాయులు యోహాను, మూర్తి, ఎంఎస్ఎన్ తదితరులు పాల్గొన్నారు.

మలయాళ స్వామి ఆశ్రమంలో ఉచిత వైద్యసేవలు 18 నుంచి

ఘంటసాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లి మళయాళస్వామి ఆశ్రమంలో ఆనెల 18వ తేదీ నుంచి ఉచిత వైద్యశిబిరం శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏర్పేడు వ్యాసా శ్రమ ఉత్తరాధికారి అసంగానంద గిరి స్వామిజీ తెలిపారు.

తాడేపల్లి గ్రామానికి చెందిన సూరపనేని రామలింగయ్య - వెంకట్రావమ్మ జ్ఞాపకార్థం వారి మనుమడు శ్రీనివాస్, కుటుంబసభ్యులచే చెన్నైకు చెందిన శంకర నేత్రాలయం కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించటం, 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు అవసరమైన వారికి ఆపరేషన్లు ఆశ్రమ ప్రాంగణంలోనే ఏర్పాటు చేసే మొబైల్ వాహనంలో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆపరేషన్ చేసిన వారికి కళ్లజోళ్ల పంపిణీ చేయటంతో పాటు 21 రోజుల తర్వాత పరీక్షిస్తామని తెలిపారు. టీడీపీ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ కంటి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆశ్రమ నిర్వాహకులు కావూరి కోదండ రామయ్య, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్, టీడీపీ నాయకులు యార్లగడ్డ వీరభద్రరావు, సూరపనేని వెంకట్రావు, మైనేని వెంకటేశ్వరరావు, మొవ్వ ప్రసాదరావు, ఆధ్యాత్మిక ప్రముఖులు మొవ్వ శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నరసప్పచెరువు సందర్శన

పెడన రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉరివి గ్రామ శివారు నరసప్పచెరువు గ్రామంలోని చెరువులో తమకూ హక్కు ఉందని తుమ్మిడి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిశీలించేందుకు డివిజనల్ అభివృద్ధి అధికారి పద్మ గురువారం గ్రామంలో పర్యటించారు. ఆ చెరువుకు ఎంతో కాలంగా ఉరివి పంచాయతీ పాటలు నిర్వహిస్తోందని, చెరువులో తుమ్మిడి గ్రామానికి చెందిన భూమి కూడా ఉన్నందున పాట మొత్తంలో కొంత ఇవ్వాలని కోరారు. సర్వే చేపట్టి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పెనుమల్లిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులతో మాట్లాడి గృహప్రవేశాలకు సిద్ధం కావాలన్నారు. స్వామిత్వ సర్వే ఏవిధంగా జరుగుతుందో పరిశీలించారు. ఎంపీడీవో అరుణకుమారి అధికారులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీకి బెడ్ వితరణ

ఘంటసాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈవో మొవ్వ నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు లీలా శ్యాంప్రసాద్, లీలా రామ్ కుమార్ రూ.30 వేల విలువ గల బెడ్‌ను ఘంటసాలపాలెం పీహెచ్‌సీకి అందజేశారు. నాగేశ్వరరావు బంధువులు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుత్తికొండ వరప్రసాదరావు, మొవ్వ కోటేశ్వరరావు (బాచి) ద్వారా పిహెచ్‌సీ వైద్యాధికారి యు.నిఖిత ప్రసాద్‌కు అందజేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ, కొల్లూరి వెంకటేశ్వరరావు, ఫార్మసిస్టు పద్మ, స్టాఫ్ నర్సు తులసీ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా యూరియా సరఫరా

నాగాయలంక, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాలకు సాగు విస్తీర్ణం మేరకు ప్రణాళికాబద్ధంగా యూరియా అందించటం జరుగుతుందని ఏవో ఏ.సంజీవ్ కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు 1165 టన్నుల యూరియా మండలంలోని పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ రిటైలర్స్ ద్వారా అందించామన్నారు. అవసరం ఉన్న రైతులు మాత్రమే, అవసరం మేరకు మాత్రమే యూరియాను డీలర్ల వద్ద కొనుగోలు చేయాలని ఆయన కోరారు.



30 మందికి సీఎం సాయం

అవనిగడ్డ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం అందిస్తున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. 30 మంది లబ్ధిదారులకు రూ.20,62,587 సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. లబ్ధిదారుల తరపున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

మోపిదేవి దేవస్థానం ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించండి

అవనిగడ్డ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో మినిమమ్ టైం స్కేలుపై పని చేస్తున్న సిబ్బంది సర్వీసును క్రమబద్ధీకరించాలని పలువురు ఉద్యోగులు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించారు.

స్త్రీ శక్తి సమావేశాన్ని జయప్రదం చేయండి

అవనిగడ్డ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలో శుక్రవారం జరుగనున్న స్త్రీ శక్తి సమావేశాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ సమావేశ మందిరంలో స్త్రీ శక్తి సమావేశం ఏర్పాట్లను తోట కనకదుర్గ, స్వర్ణలత, కృష్ణ కుమారి తదితరులతో కలసి పర్యవేక్షించారు. యాసం చిట్టిబాబు, మొగల్ మురాద్ బేగ్, బచ్చు రఘునాథ్ ప్రసాద్, దుర్గా ప్రసాద్, ఆదినారాయణ, కర్రా సుధాకర్, మండలి రామ్మోహనరావు పాల్గొన్నారు.



బండే శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

కోడూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు మండలంలో గురువారం ఘనగా నిర్వహించారు. కోడూరు ప్రధాన సెంటర్‌లో, గొల్లపాలెం సెంటర్ తూర్పువైపున, తొమ్మిదో వార్డు, స్వతంత్ర్యపురం, హరిపురం, దింటిమెరక, జరుగువానిపాలెం, మంద పాకల, పోటుమీద, లింగారెడ్డిపాలెం, వడ్డెరపాలెం, యాద్రారెడ్డిపాలెం గ్రామాల్లో శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కేకులు కట్ చేసి మిఠాయిలు పంచారు. గ్రామ పార్టీ అధ్యక్షులు, పీఏసీఎస్‌ల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్‌కి సర్పంచ్ అర్జునరావు

నాగాయలంక, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : న్యూ ఢిల్లీలో ఈనెల 15నజరిగే సర్పంచ్ సంవాద్ నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్‌కు పెదకమ్మవారిపాలెం సర్పంచ్ తలశిల అర్జునరావు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వానం అందింది. భారత ప్రభుత్వం తనకు ఆహ్వానం పంపినందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశం ద్వారా ఆరోగ్యకరమైన గ్రామాల లక్ష్యాల సాధనకుమార్గదర్శకత్వం లభించనుంది.

దైవజనులందరూ ఐకమత్యంగా ఉండాలి

చల్లపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దైవ సేవకులు అందరూ ఐకమత్యంగా ఉండాలని కేరళ రాష్ట్రానికి చెందిన అపోస్టల్ సురేష్‌బాబు అన్నారు. చల్లపల్లి ఇమ్మానియేలు ఐక్యకాపరుల సహవాసం పెరల్ జూబ్లీ (30 ఏళ్ల) వేడుకలు రామానగరం హోలీ ఫైర్ చర్చిలో గురువారం ఘనంగా ముగిశాయి. అతిథులను, ఇమ్మానియేలు ఐక్యకాపరుల సహవాసం అధ్యక్ష కార్యదర్శులు బిషప్ కనగాల సుదర్శన మోజెస్, డా.ఎం.మరియకుమార్, ఉపాధ్యక్షులు పల్లికొండ సాల్మన్‌రాజు, కోశాధికారి తాతా సత్యమూర్తి, సహాయ కార్యదర్శి గోల్కొండ ఏసురాజు, సలహాదారు రాంపురపు దానియేలు ఎజ్రాలను సహవాసం ప్రతినిధులు పట్టు వస్త్రాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పల్లికొండ ఏసుదాసు, గోల్కొండ డేవిడ్, ఈసీ మెంబర్లు, దివిసీమ పరిసర ప్రాంతాల దైవజనులు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం

అవనిగడ్డ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం ఎంతో మేలు చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు అన్నారు.ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షులు మాదివాడ రత్నారావు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్, కూటమి నాయకులు మండలి వెంకటేశ్వరరావు, మాచవరపు ఆదినారాయణ, లింగం బా బురావు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, గుడివాక శివరావు, అన్నపరెడ్డి రాందాసు, మండలి శేషు, బడే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా కమిటీ ఎంపిక



నాగాయలంక, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు గురువారం నూతన కమిటీలను ప్రకటించారు. కృష్ణా జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఒడుగు రామచంద్రరావు, అధ్యక్షులుగా విశ్వనాథపల్లి సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా నడకుదుటి రాధాకృష్ణమూర్తి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు నియామక పత్రాలను అందజేశారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

● బందరు, అవనిగడ్డలో డీఎస్సీ అభ్యర్థుల ధర్నా

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా నియమిస్తున్న డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలంటూ 2023 డీఎస్సీ ఫోరం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. 2024 ఫోరం నాయకులు బి.మల్లికార్జున్, సుధాకర్, శివరామకృష్ణ, మురళీకృష్ణ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ సుబ్రహ్మణ్యం తదితరులు ధర్నాకు నాయకత్వం వహించారు. **అవనిగడ్డ :** డిఎస్సీ-2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బి.కనకారావు, డీపీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జివి.ఎస్.పెరుమాళ్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో కలసి నిరసన ప్రదర్శన నిర్వహించారు.

కొత్త పెన్షన్ విధానం కారణంగా ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం 2003 ఉపాధ్యాయులకు కూడా పాత పెన్షన్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.